

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ ధరావత్

# ఫేక్ లేఖ..

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి మావోయిస్టుల బెదిరింపు కాదు
- మూడు రోజుల్లో కేసును ఛేదించిన డిఎస్పీ వెంకటేశ్వర్లు బృందం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి ధరావత్

**జడ్చర్ల, జనవరి 15 ప్రభాతవార్త:** జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ప్రవర్తన బాగోలేదని, పద్ధతి మార్చుకోవాలని హెచ్చరిస్తూ రాసిన లేఖ ఫేక్ అని, అది స్థానికులు రాసిన బెదిరింపు లేఖ అని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రంగారెడ్డి గూడ గ్రామానికి – మిగతా4లో..

మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# అర్హులను ఎంపిక చేయాలి

- రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం లబ్ధిదారులను ఎంపిక చేసే అర్హత ప్రమాణాలు, విధానాలను అధికారులకు గూగుల్ మీట్ ద్వారా వివరించిన కలెక్టర్ బదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 15 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులనే ఎంపిక చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులపై అదనపు కలెక్టర్లు కే సీతారామారావు, దేవ సహాయంలతో కలిసి బుధవారం సాయంత్రం కలెక్టరేట్ నుండి గూగుల్ మీట్ ద్వారా జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం లబ్ధిదారులను ఎంపిక చేసే అర్హత ప్రమాణాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పథకాల మార్గదర్శకాలు, ప్రభుత్వ విధానాలను కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులు,ఎంపీడీవోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లకు స్పష్టంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన రైతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతు భరోసా జాబితాలో చేర్చాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన నిరుపేదలకు కేటాయించేలా జాబితా సిద్ధం చేయాలన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులకోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈనెల 16వ తేదీ నుంచి ఈనెల 20వ తేదీ లోగా ప్రతి అధికారి క్షేత్రస్థాయిలోకి వెళ్లి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. రైతు భరోసా పథకానికి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. భూ భారతి (ధరణి) పోర్టల్‌లో నమోదు చేసుకున్న సాగు భూమి విస్తీర్ణం ఆధారంగా, పట్టా సాగుకు యోగ్యం కాని భూములను పథకానికి పరిగణించరాదాన్నారు. ఇళ్లు లేదా కాలనీలుగా మారిన అన్నిరకాల భూములు, రియల్ ఎస్టేట్ లేఅవుట్లు, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలకు వినియోగించే భూములు, గోడౌన్లు, మైనింగ్, ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అన్ని రకాల భూములు, రాళ్లు, గుట్టలు లేని భూములు, సాగుకు అనుకూలమైన భూములను సాగుకు యోగ్యం కాని భూములుగా గుర్తించాలన్నారు. రైతు భరోసా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను కూడా ప్రభుత్వం ప్రకటించిందని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్) కింద –మిగతా4లో..

# ఇక క్షేత్రస్థాయికి..

- గ్రామాలు, మున్సిపాలిటీలో ప్రత్యేక బృందాల పర్యటన
- వ్యవసాయ యోగ్యం కాని భూములకు రైతు భరోసా కట్
- ఈనెల 20 వరకు రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై క్షేత్రస్థాయి పరిశీలన
- పథకాలపై కలెక్టర్ విజయేంద్ర బోయి సమీక్ష



**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 15 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,కొత్త రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్ల పథకాలను అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. ఈ నెల 16 నుండి 20 వరకు ఈ పథకాల పై గ్రామంలో, మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, రెవెన్యూ అధికారుల బృందాలు గ్రామ, వార్డ్ స్థాయిలో వ్యవసాయ యోగ్యమైన భూమి గుర్తించేందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన లో భూ భారతి (ధరణి)పోర్టల్ లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా పట్టదారులకు రైతు భరోసా అందుతుందని తెలిపారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను రైతు భరోసా నుండి తొలగించ నున్నట్లు తెలిపారు. ఇళ్లు లేదా కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్ లేఅవుట్ లు,రోడ్లుగా మారిన భూములు,పరిశ్రమలకు, గోదాంలకు, మైనింగ్ కు వినియోగిస్తున్న భూములు, ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూములు, రాళ్ళు, రప్పలు,గుట్టలతో ఉండి సాగుకు అనువుగా లేని భూములు వ్యవసాయ యోగ్యం కాని భూములుగా గుర్తించనున్నట్లు తెలిపారు కొత్త రేషన్ కార్డులు కుల గణన సర్వే ఆధారంగా తయారుచేసిన రేషన్ కార్డు లేని కుటుంబాల జాబితా క్షేత్రస్థాయి పరిశీలనకు మండల స్థాయిలో ఎంపీడీవోలు పట్టణ స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు ప్రక్రియకు బాధ్యులని, సంబంధిత టీమ్ లు క్షేత్ర పరిశీలన చేస్తారని అన్నారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కు ఉపాధి హామీ కింద 2023.24 సం.లో 20 దినాలు పని చేసిన జాబ్ కార్డ్ కలిగిన భూమి లేని కూలీల జాబితా అంద చేయడం జరుగుతుందని అన్నారు ఇందిరమ్మ ఇం డ్లప్రజాపాలన లో దరఖాస్తు చేసుకున్న వారిలో దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, ఇంటి నిర్మాణ స్థలం కలిగి ఉన్నవారు, అద్దె నివాసంలో ఉండేవారు అర్హులని, ఆర్ సి సి, ఇటుక గోడలు లేకుండా రేకుల షెడ్డు, గుడిసెలు ఉన్నవారికి, యువ వితంతువులు, భూమిలేని వ్యవసాయ కార్మికులు, పారిశుద్ధ కార్మికులు, వికలాంగులకు ఈ పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే అర్హులైన ప్రజాపాలన దరఖాస్తులలో సొంత స్థలాలు లేని వాళ్ళకు కూడా ఇండ్లు కేటాయించబడతాయని అన్నారు. నాలుగు పథకాలకు సంబంధించిన లబ్దిదారుల జాబితా క్షేత్ర పరిశీలన పూర్తి తర్వా తఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలలో ప్రదర్శించి, చదివి ఆమోదం పొందనున్నట్లు తెలిపారు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ఊరూరా సంక్రాంతి

- ముంగిట్లో రంగవల్లులు, భోగి మంటలు
- పతంగులతో చిన్నారుల కేరింతలు
- ఊరు వాడలో పండుగ సందడి





జడ్చర్లలో విజేతలకు బహుతులు అందజేస్తున్న రాధాకృష్ణ



భైరంపల్లిలో విజేతలకు బహుతులు అందజేస్తున్న భైరంపల్లి రమేశ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 15 ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. ఆకాశంలో ఉన్న రంగులు వాకిటవాలి సింగడైన వేళ, ఆడపడుచుల సందడికి ప్రకృతి పులకించిన సమయాన చిన్నా, పెద్ద అంతా సంబరమే. కొత్త అల్లుళ్లరాక, కోడి పందేల సందడి. బసవన్నల సంచారం, హరిదాస లు కీర్తనలతో సరదాల సంక్రాంతి సంబురాలు మొదలయ్యాయి. మూడు రోజుల ముచ్చటైన పండగలో సోమవారం భోగి వేడుకలను అంతా ఘనంగా జరుపుకున్నారు. ఆకాశంలో ఉన్న రంగులు వాకిటవాలి సింగడైన వేళ, ఆడపడుచుల సందడికి ప్రకృతి పులకించిన సమయాన చిన్నా, పెద్ద అంతా సంబురమే. కొత్త అల్లుళ్లరాక, బసవన్నల సంచారం, హరిదాసుల కీర్తనలతో సరదాల సంక్రాంతి సంబురాలు మొదలయ్యాయి. మూడు రోజుల ముచ్చటైన పండగలో సోమవారం భోగి వేడుకలను అంతా ఘనంగా జరుపుకొన్నారు. పతంగుల ఎగురవేతలో యువత, పిల్లలు ఆకాశంలో ఉన్న రంగులు వాకిటవాలి సింగడైన వేళ, ఆడపడుచుల సందడికి ప్రకృతి పులకించిన సమయాన చిన్నా, పెద్ద అంతా సంబురమే. కొత్త అల్లుళ్లరాక, కోడి పందేల సందడి. బసవన్నల సంచారం, హరిదాస లు కీర్తనలతో సరదాల సంక్రాంతి సంబురాలు మొదలయ్యాయి. మూడు రోజుల ముచ్చటైన పండగలో సోమవారం భోగి వేడుకలను అంతా ఘనంగా జరుపుకున్నారు. ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభానికి ముందు రోజు కష్టాలు తొలగిపోయి, అన్నీ శుభాలు సంప్రాప్తించాలని కోరుతూ భోగి మంటలు వేశారు. ఈ మంటల్లో చెడును వదిలించుకోవడానికి పాత సామాగ్రిని దహనం చేయడం సంప్రదాయం. ఉమ్మడి జిల్లాలోని పట్టణాలు. పల్లెల్లో సోమవారం తెల్లవారు జామునుంచే వేడుకలు మొదలయ్యాయి. ఊరు, వాడల్లో భోగిమంటలు వేసి సంబురాలు జరుపుకున్నారు. అదేవిధంగా సంబురాల సంక్రాంతికి అంతా సిద్ధమయ్యారు. బుధవారం కనుమ పూర్తి చేసుకున్నారు. ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులువేసి, ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలను పసుపు, కుంకుమలు, పుష్పాలతో అలంకరించారు. ఇంటికి చేరిన ఆడపడుచులు, బంధువులు, ముగ్గులతో ఇంటి ప్రాంగణాలను తీర్చిదిద్దడంతో ప్రతీ ఇల్లూ కళకళలాడుతోంది.



జడ్చర్ల పద్మావతి కాలనీలో..




జడ్చర్ల పద్మావతి కాలనీలో..







# పోటెత్తారు..

## ఎక్కరా! ఎక్కు.. ఎత్తం గట్టు!

### శ్రీ రామలింగేశ్వర స్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు

**కొల్లాపూర్, జనవరి 15 ప్రభాతవార్త :** కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కోడేరు మండలంలోని ఎత్తం గ్రామంలో ఎత్తైన కొండపైన వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి దర్శనానికి నియోజకవర్గంలోని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోనే 15 వందల అడవుల ఎత్తైన కొండ కలిగిన గట్టుగా ప్రాచుర్యం పొందింది. ప్రతి సంవత్సరంలో ఈ ప్రాంతంలో భక్తులు కొండపైకి వెళ్లి రామలింగ స్వామిని దర్శనం కోసం పలు ప్రాంతాల నుంచి ప్రజలు తండోప.. తండాలుగా విచ్చేస్తూ.. స్వామివారిని దర్శించుకుంటారు. మంగళవారం వేల సంఖ్యలో భక్తులు మంగళ, బుధవారాలలో దర్శించుకున్నారు. కొండ దిగువ నపెద్ద ఎత్తున జాతర నిర్వహించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం సైతం నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని అతిపెద్ద కొండగా ప్రసిద్ధి చెందింది. పరిసర ప్రాంతాల్లో పచ్చని పైరులు, పలు జలాశయాలను, సింగోటం శ్రీవారి చెరువును భక్తులు కొండపై నుంచి తిలకించారు.

# ఉత్సాహంగా భోగ్ బండర్

## పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి జనవరి 15 ప్రభాతవార్త:** గిరిజనుల సాంప్రదాయ పండుగ అయిన భోగ్ బండార్ కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. మంగళవారం వనపర్తి పట్టణం నాగవరం తండాలో సంక్రాంతి పండుగ సందర్భంగా అభయ ఆంజనేయస్వామి గుడి దగ్గర భోగ్ బండర్ కార్యక్రమనికి హాజరైన ఎమ్మెల్యే ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### విజేతలకు బహుమతుల ప్రదానం

వాలీబాల్ క్రీడ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మంగళవారం వనపర్తి మండలం చిట్యాల గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడల అభివృద్ధి కోసం అనేక చర్యలు చేపట్టిందని క్రీడలతో దేహదారుఢ్యం లభించడంతో పాటు వ్యక్తిగత దేశ ప్రగతి నలుమూలల చాటవచ్చునని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చిట్యాల గ్రామ అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని నాయకులు కార్యకర్తలు అందరూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రఘుపతిరావు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భోగ్ బండర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

# మిసెస్ ఇండియాగా సూదిని సుష్మా రెడ్డి

- తెలంగాణ కిరీటం కైవసం
- వెల్దండ మండలం రాచూరులో సంబురాలు



**వెల్దండ, జనవరి 15 ప్రభాతవార్త:** వెల్దండ మండలం రాచూరు గ్రామానికి చెందిన డాక్టర్.సూదిని సుష్మారెడ్డి మిసెస్ ఇండియా తెలంగాణగా నిలిచారు. 2025 సంవత్సరానికిగాను నిర్వహించిన మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పోటీలో పాల్గొన డాక్టర్.సూదిని సుష్మారెడ్డి మిసెస్ ఇండియా కిరీటాన్ని సాధించారు. మోస్ట్ పాపులర్ మోస్ట్ డెలిగేట్ టైటిల్స్‌ను సైతం కైవసం చేసుకున్నారు. సుష్మారెడ్డి నాలుగు శాఖలతో కూడిన శ్రేష్ట మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ సీఈఓగా, శ్రేష్ట ఫౌండేషన్ సహ వ్యవస్థాపకురాలుగా వ్యవహరిస్తున్నారు. ప్రతిష్టాత్మక పౌండెంట్ డెంటల్ ఆస్కార్ అవార్డు గ్రహీతగా నిలిచారు. రెండు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను నెలకొల్పారు. సుష్మారెడ్డి మిసెస్ ఇండియా కిరీటాన్ని సొంతం చేసుకున్న సందర్భంగా గ్రామస్తులతో పాటు మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

# పండగపూట విషాదం

- వేర్వేరు ఘటనల్లో ఐదుగురు దుర్మరణం

- కల్వకుర్తి పరిధిలో ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి
- నారాయణపేట జిల్లాలో చేపల వేటకు వెళ్లి ఒకరు..
- బాలానగర్ మండలంలో కారు అదుపుతప్పి మరొకరు..
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోధనలు

4లో..



మృతుడు జోగు బంగారయ్య

మృతుడు మహేష్

కల్వకుర్తి ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో



నారాయణపేట జిల్లా లక్ష్మీపూర్ చెరువులో మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

## సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందాం

**వెల్దండ, జనవరి 15 (ప్రభాతవార్త):** అనాదిగా వస్తున్న మన భారతీయ సంస్కృతి సంప్రదాయలను కాపాడుకొని భావితరాలకు అందించాల్సి నబాధ్యత మనందరిపై ఉందనిబహుమతి దాతలు నారాయణ చంద్రారెడ్డి, శ్రీపాల్‌రెడ్డిలు అన్నారు. చారగొండ మండల పరిధిలోని సిర్స నగండ్ల గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగులతో చక్కని కళాత్మకమైన ముగ్గులను వేశారు. నిర్వాహకులు పరిశీలించి మొదటి బహుమతి విజేత పగడాల అనూష, రెండవ బహుమతి గిరీష, మూడో బహుమతి విజేత వినోదలు అందుకున్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## నేడు కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి జయంతి

**కల్వకుర్తి, జనవరి 15 (ప్రభాతవార్త):** స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి ఉత్తమ పార్లమెంటు సభ్యులు స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి 83వ జయంతి పురస్కరించుకొని గురువారం కొత్త చౌరస్తాలో జైపాల్‌రెడ్డి విగ్రహం వద్ద ఉదయం 11 గంటలకు జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లు తెలిపారు. కల్వకుర్తి మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అన్ని విభాగాల నాయకులు, అభిమానులుఅందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణాలు సత్వరం పూర్తి చేయాలి

**-మద్దిగట్లలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి**

**భూత్పూర్, జనవరి 15, (ప్రభాతవార్త):** డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణాలను సత్వరం పూర్తి చేసి వీలైనంత త్వరలో లబ్ధిదారులకు అందజేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జిమధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యే జీఎంఆర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మద్దిగట్లలో ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణాల సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గూడు లేని నిరుపేదలకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే జీఎంఆర్ వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజమల్లయ్య, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటిభూపతిరెడ్డి, దెందిలక్ష్మికాంత్‌రెడ్డి, మొల్గర వెంకటేష్, తమన్నగౌడ్, వడ్డె శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

## వావిలాలలో శివాంజనేయ స్వామి రథోత్సవం

**ఇటిక్యాల, జనవరి 15 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని వావిలాల గ్రామంలో వెలసిన శ్రీ శివాంజనేయ స్వామి జాతర బ్రహ్మోత్సవాలను ఈనెల 12 నుండి నిర్వహిస్తుండగా మంగళవారం రాత్రి సమయంలో గ్రామ పెద్దలు గ్రామస్తులు భక్తులు దివ్య మంగళ రథోత్సవ కార్యక్రమం వైభవంగా కొనసాగించారు. స్వామివారి రథోత్సవాన్ని తిలకించేందుకు గ్రామస్తులు అలాగే చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ శివాంజనేయ స్వామి జాతర బ్రహ్మోత్సవాలను గ్రామ పెద్దలు. ఆలయ నిర్వాహకులు ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు..

## సిపిఐ జిల్లా కార్యదర్శి కొండన్న మృతి

**మక్తల్, జనవరి 15 (ప్రభాతవార్త):** సిపిఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి కొండన్న (57) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. మక్తల్ మండలంలోని దాసరి దొడ్డి గ్రామానికి చెందిన కొండన్న చిన్నతనం నుంచే సిపిఐ, అనుబంధ సంఘాల్లో చురుగ్గా పనిచేస్తూ సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగా అంచలంచెలుగా ఎదిగారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం రాత్రి మృతి చెందారు. మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి, బి కేర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ రెడ్డి, మాజీ జడ్పిటిసి లక్ష్మారెడ్డి తో పాటు సిపిఐ శ్రేణులు, ప్రజాసంఘాలనాయకులు కొండన్న మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బుధవారం సాయంత్రం దాసర్ దొడ్డిలో కొండన్న అంత్యక్రియలను నిర్వహించారు.

## ఉమ్రా యాత్రికుని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే ఆల

**భూత్పూర్, జనవరి 15, (ప్రభాతవార్త):** ముస్లింల పవిత్ర స్థలం మక్కా ఉమ్రా యాత్రకు ఈ నెల 18న బయలుదేరుతున్న బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు మొహ్మద్ సాధిక్ తనయుడు మొహ్మద్ ఆరిఫ్ హుస్సేన్‌ను బుధవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంక టేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌లుశాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ పవిత్ర మక్కా యాత్రా స్థలాన్ని సందర్శించేందుకు చిన్నతనంలోనే వెళ్లాలనుకోవడం ఆరిఫ్ హుస్సేన్ సన్మార్గతత్వం, భక్తి భావం వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణ గౌడ్, మనెమోని సత్యనారాయణ, టి మురళిధర్‌గౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, మేకల సత్యనారాయణ, సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్. సత్తూర్ సురేష్‌గౌడ్, గడ్డం రాములు, గడ్డం ప్రేమ్, బాల్‌రెడ్డి, పులగుర్ల మల్లేష్, గడ్డం డీలర్‌నర్సింహ, వడ్ల బ్రహ్మయ్య, మొహ్మద్ షేక్ యాసిన్, బోల వెంకట్రాములు, సత్తూర్ అశోక్‌గౌడ్, మాల విఠల్‌దాస్ వెంకటేష్, బీఆర్ఎస్ మైనార్టీఅన్నాసాగర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మొహ్మద్ షాకీర్ పాల్గొన్నారు.

## పెరికివీడులో నిరుపేదలకు బెడ్ షీట్లు పంపిణీ

**కోయిలకొండ, జనవరి 15 (ప్రభాతవార్త) :** మండలంలోని పెరికివీడు గ్రామంలో నిరుపేద ప్రజలకు గుంజు మండల స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు రమేష్ ముదిరాజ్ సంక్రాంతి పర్వదినం అయిన బుధవారం నాడు బెడ్ షీట్లు, దుస్తులు తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నిరుపేద ప్రజలను ఆదుకోవడానికి తనవంతుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. అన్ని గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికే పర్యటించి దుస్తులు, వంట సామాగ్రి, నిత్యవసర వస్తువులు, సరుకులు పంపిణీ చేయడం జరిగింది అన్నారు. **బహుమతుల ప్రదానం:** గుంజు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెరికివీడు గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చిన్నారులు, గ్రామస్తులు పాల్గొని రంగురంగుల రంగవల్లికలు వేశారు. రంగవల్లికలలో ప్రతిభ ఘనపరిచిన వారికి రమేష్ ముదిరాజ్ బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సత్యపాల్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

**పాన్‌గల్ జనవరి 15 (ప్రభాతవార్త):** నేడు యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని క్రీడలతో మానసిక ఉల్లాసం, దేహారుద్యం పొందుతారని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. సంక్రాంతి పండగ సంబరాలను పురస్కరించుకొని గత రెండు, మూడు రోజులుగా డివైఎఫ్ఐ ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి ఉన్నత స్థానాలను చేరుకోవాలని జర ముఖ్యంగా యువత చెడు వ్యసనాల దారిన పడకుండా ఈవయసులోనే జాగ్రత్తలు పాటించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై పెట్టుకున్న ఆశలను అడియాసలు చేయకుండా వారి కలలను నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యా నాయక్ ఐద్వా మహిళా సంఘం అధ్యక్షురాలు సాయిలీల, లిటిల్ స్టార్ స్కూల్ కలస్పాండెంట్ శేఖర్ యాదవ్, డివైఎఫ్ఐ నాయకులు మల్లేష్, కృష్ణయ్య, రైతు సంఘం నాయకులు జములయ్య తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**◆ జూపల్లి అరుణ్ కుమార్**

**కొల్లాపూర్, జనవరి 15 (ప్రభాతవార్త):** కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చుక్కాయిపల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జూపల్లి అరుణ్ కుమార్ క్రీడలు మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటించారు. చిన్నంబాయి మండలం దగడపల్లి గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. అనంతరం కొల్లాపూర్ మండల పరిధిలోని చుక్కాయిపల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను సందర్శించిన జూపల్లి అరుణ్ ను సింగల్ విండో డైరెక్టర్ పసుపుల నరసింహ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బింగి మహేష్ యాదవ్ శాలువాతో సన్మానించారు. అనంతరం అరుణ్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కృష్ణ ప్రసాద్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర రెడ్డి, మాజీ సర్పంచ్ బీచ్పల్లి యాదవ్, బుచ్చన్న, స్థానిక ప్రజా ప్రతినిధులు, కొల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇక్బాల్, యువ నాయకులు వంగ రాజశేఖర్ గౌడ్, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ ధర్మాతేజ, పసుల వెంకటేష్, కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా సాగిన ఎద్దుల బండలాగుడు పోటీలు

**ఇటిక్యాల, జనవరి15 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని వావిలాల గ్రామంలో వెలసిన శ్రీ శివాంజనేయ స్వామి జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం నాలుగు పళ్ళ విభాగపు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 13 ఎద్దుల జతలు పాల్గొనగా ఇందులో ఐదుగురు విజేత ఎద్దుల జతలను బహుమతులకు ఎంపిక చేశారు. మొదటి బహుమతి రూ. 35 వేలు, నంద్యాల జిల్లా అలగనూరుకు చెందిన ఎద్దుల జత ద్వితీయ బహుమతి రూ. 25 వేలు, కలసపాడు అంజిరెడ్డి ఎద్దుల జత మూడో బహుమతి రూ.15 వేలు కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి డోన్ ఎమ్మెల్యేకు చెందిన ఎద్దుల జత నాలుగవ బహుమతి రూ.10 వేలు రాయచూరుకు చెందిన జమ్మన్న ఎద్దుల జత ఐదవ బహుమతి రూ. 5 వేలు, గునుపాడుకు చెందిన మక్షిత్ రాజు ఎద్దుల జత యజమానులకు శ్రీ శివాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

**-వ్యవసాయ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట -రైతు సంబరాలలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 15 (ప్రభాతవార్త):** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ళ రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా తూడుకుర్తి గ్రామంలో శివరామాలయ దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించే రైతు సంబరాల సందర్భంగా వృషభరాజుల (ఏద్దుల)చే బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ప్రారంభించి ప్రసంగించారు. ఇలాంటి పోటీలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రం అంటే పాడి పంటలకు పెట్టింది పేరని, అది గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడు ఈనాడు రైతుకే పెద్ద పీట వేస్తూ రైతు సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి రైతు, రైతు కూలీ బాగుండాలన్న సంకల్పంతో రైతు భరోసాను కల్పిస్తుందన్నారు. భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు చెల్లించడానికి ముందుకు వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో రైతు రాజ్యం సాధ్యమైందన్నారు. రాబోయేరోజుల్లో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు అండగా నిలుస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో బండలాగుడు పోటీలను నిర్వహించిన దేవాలయ కమిటీ వారికి ఆయన అభినందించారు. ప్రతి ఏడాది ఎంతో ఉత్సాహంగా ఈ పోటీలు నిర్వహించడం, అదినా స్వగ్రామం కావడం గర్వంగా ఉందని రాజేష్‌రెడ్డి అన్నారు. అనంతరం బండలాగుడు పోటీలను ప్రజలు గ్రామస్తుల హర్షధ్వనుల మధ్య ఎమ్మెల్యే ప్రారంభించారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

అంతకుముందు గ్రామస్తులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బాణా సంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ బండలాగుడు పోటీలలో తెలుగు రాష్ట్రాలకు చెందిన12 జతలఎద్దులు, నిర్వాహకులు యజమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారు ఇంద్రారెడ్డి, నాగనూలు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీలు బండి శాంతమ్మ, అల్లిపూర్ వెంకటస్వామి, సత్తవరం లక్ష్మారెడ్డి, చిగుళ్లపల్లి పాండు, మాజీ సర్పంచ్ వెంకటయ్య, సత్తవరం కరుణాకర్ రెడ్డి, కౌన్సిలర్ సునేంద్ర, మాజీ సర్పంచ్ విజయేందర్ రెడ్డి, టమాటాల వెంకటయ్య, పలువురు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, తూడుకుర్తి గ్రామ ప్రజలు పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలను విస్తృత పరుస్తాం

**లయన్స్ క్లబ్ ఎల్సిఎఫ్ ఏరియా లీడర్, మాజీ గవర్నర్ జి చెన్న కిషన్ రెడ్డి**

**కల్వకుర్తి, జనవరి 15 (ప్రభాతవార్త):** కల్వకుర్తి మున్సిపాలిటిలోని తిమ్మరాశిపల్లిలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ సంపతి జనార్దన్ రెడ్డి సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం సమకూర్చిన దుప్పట్లు, రగ్గులను లయన్స్ క్లబ్ అధ్యక్షులు పసులలక్ష్మారెడ్డి, రాంరెడ్డి లయన్స్ ఐ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ వి. దామోదర్‌రెడ్డిలతో కలిసి మాజీ గవర్నర్ జి.చెన్న కిషన్‌రెడ్డివృద్ధులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో వృద్ధులకు వికలాంగులకు చలితో ఇబ్బందులకు గురికాకుండా ఉండటం కొరకు ఈ దుప్పట్లు అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ఉండడం కొరకు చలి తీవ్రతను తట్టుకోవడం కోసం రగ్గులను అందజేసినట్లుగా తెలిపారు. లయన్స్ క్లబ్ సేవలు క్లబ్‌సభ్యుల సహకారంతో విస్తృత పరుస్తామని అన్నారు. ప్రతి సభ్యులు సేవాగుణాన్ని అలవర్చుకొని దానగుణాన్ని అలవర్చుకోవాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ చేసే సేవాకార్యక్రమాల్లో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 200 మందికి దుప్పట్లు అందజేసినట్లు క్లబ్ జోన్ చైర్మన్ సంపతి జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ చైర్మన్ శ్రీశైలం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంపతి పర్వత్ రెడ్డి, కోశాధికారి నరసింహ, జిల్లా చైర్మన్ కె.రామ్‌రెడ్డి, ఓంకారం, జూలూరు లింగయ్య, క్లబ్ పిఆర్ఓ పాషా, సభ్యులు సురేందర్ రెడ్డి, శ్రీరామ్, దొడ్లకృష్ణయ్య, సాటు యాదయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## నేటి నుంచి రైతు భరోసాపై సర్వే

- ◆ 20వ తేది వరకు 5రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలన
- ◆ 21నుంచి గ్రామ సభలు..ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపికలు
- ◆ భూత్పూర్ ఎంపిడీఓ కార్యాలయంలో ముందస్తు సమీక్ష నిర్వహించిన మండల అధికారులు



మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ వేణుగోపాల్, ఎంపీడీఓ ప్రభాకర్

**భూత్పూర్, జనవరి 15, (ప్రభాతవార్త):** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో ప్రజలు ఇచ్చిన అభ్యర్థనల మేరకు ఈ నెల 16నుంచి సర్వేకు జిల్లా, మండల స్థాయి అధికారులు సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగానే బుధవారం స్థానిక ఎంపిడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రభాకర్‌చారి ఆధ్యక్షతన మండల అధికారుల ముందస్తు ప్రిపరేటరీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రభాకర్, స్పెషలాఫీసర్ వేణుగోపాల్‌లు మాట్లాడుతూ మండలంలో గురువారం నుంచి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో రైతు భరోసాపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా సర్వేలో భాగంగా రైతులకు సంబంధించి వ్యవసాయ యోగ్యంకాని భూముల్ని గుర్తించి నివేదిక తయారు చేస్తామన్నారు. ఈసర్వే ఈనెల 20వ తేది వరకు ఐదు రోజుల పాటు ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల అంశాన్ని చర్చిస్తూ వీటిపై నివేదికలు, లబ్ధిదారుల ఎంపికలు జరిగాయని ఈ నెల 21నుంచి జరిగే గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. రేషన్‌కార్డులలో కొత్తగా పేర్లను చేర్చేందుకు ప్రభుత్వం వీలు కల్పించిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగాభూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలను గుర్తించి వారికి ప్రభుత్వం రు.12వేల ఆర్థిక సహాయం అందించేందుకు సర్వేను నిర్వహిస్తున్నామని అన్నారు. అయితే ఈ పథకంలో లబ్ధిపొందాలంటే భూమిలేని నిరుపేద గ్రామీణ వ్యవసాయ కూలీలు 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు ఈజీఎస్‌లో పనిచేసి ఉండాలని తెలిపారు. సమీక్షా సమావేశంలో తహశీల్దార్ రహమాన్‌తో పాటు మండల వ్యవసాయాధికారి మురళిధర్ ఇతర వివిధ మండల శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**బిజినేపల్లి, జనవరి 15 (ప్రభాతవార్త):** అంతర్జాతీయ వేదికపై భారతీయతత్వాన్ని చాటిన మహోన్నత అధ్యాత్మికవేత్త స్వామి వివేకానంద అని హెచ్ఎం హనుమంత్ రెడ్డి అన్నారు. నంది వడ్డెమాన్ గ్రామంలో మంగళవారం స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ భరతజాతి సాంస్కృతిక వైభవం విశ్వవ్యాప్తం చేయడం కోసం ఆజన్మాంతం కృషి చేసిన వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. న్యాయవాది వీరశేఖర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో ప్రతిభ ఉందని స్వామి వివేకానంద నమ్మారు అని ఆయన ఎంతో మంది యువతకు స్ఫూర్తి అన్నారు. విదేశీ పాలనలో మసకబారిన మనదేశ ఖ్యాతిని హిందూ మతం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి స్వామి వివేకానందుడిగా వెలుగొందిన భారతీయ యువకుడు వివేకానంద అన్నారు. దేన్నైనా సాధించగలననే ఆత్మ విశ్వాసాన్ని ఒక వ్యక్తిలో కలిగించడం కన్నా మించిన సాయం లేదన్నారు వివేకానంద అని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

## దేశ సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

**-ఘనంగా ఆర్మీడే నిర్వహించిన సైనికులు**



ఆర్మీ డే వేడుకల్లో పాల్గొన్న పలువురు నాయకులు, మాజీ ఆర్మీ జవాన్లు

**వెల్దండ, జనవరి 15 (ప్రభాతవార్త):** దేశ రక్షణ, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటు పడుతున్న దేశ సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ తాలూకా అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, మాజీఎంపీటీసీలు చిందంకృష్ణయ్య, వై.విజేందర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు సంజీవ్ యాదవ్, మట్ట వెంకటయ్య గౌడ్‌లు పేర్కొన్నారు. వెల్దండ మండలకేంద్రంలోని ఆకృతి గార్డెన్‌లో ఆర్మీడేను బుధవారం మండల సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మట్ట చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ తాలూకా అధ్యక్షులు పర్వత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు చిందంకృష్ణయ్య, వై.విజేందర్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు సంజీవ్ యాదవ్, మట్ట వెంకటయ్య గౌడ్‌లు పాల్గొని మాట్లాడుతూ దేశ కోసం, సైనికులు వారి కుటుంబాలను, వదిలి మైనస్ డిగ్రీలో మంచు కురుస్తున్న మరోపక్క మండుటెండలను సైతం లెక్క చేయకుండా కంటికి రెప్పలగా భారతదేశాన్ని కాపాడుతున్న మన సైనికుల త్యాగాలు అమరం. వారు అక్కడ ఉండటం వలనే మనం ఈరోజుఇక్కడ ప్రశాంతంగా తమ కుటుంబాలతో జీవిస్తున్నా మన్నారు. మండల కేంద్రంలో నిర్మించనున్న సైనికుల సంక్షేమభవననిర్మాణానికి మట్ట వెంకటయ్యగౌడ్ రూ.1.20 లక్షలు, సంజీవ్ యాదవ్ 50 వేల నగదును మట్ట చంద్రశేఖర్ గౌడ్‌కు అందించారు. సైనికుల సంక్షేమ సంఘంనూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సైన్యంలో పనిచేస్తున్న వారి తల్లిదండ్రులను శాలువాలతోసన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ వై.హరికాంత్ రెడ్డి, మైనార్టీ సంఘం మండల అధ్యక్షులు ఎండి రషీద్, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి, ఎండి.అలీ, తిరుపతి రెడ్డి, లింగం ముదిరాజ్, జంగిలి యాదగిరి, మట్ట మదన్ గౌడ్, సైనికుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు పురుషోత్తంచారి, సైనికులు పి.యాదయ్య, శరత్‌గౌడ్, ఆర్.శ్రీను, తిరుపతయ్య, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్, జి.గణేష్, మన్సూర్, విజేందర్‌గౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

**-సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.ఆంజనేయులు**

**కల్వకుర్తి, జనవరి 15 (ప్రభాతవార్త):** సీపీఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఈ నెల 25 నుండి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు పేర్కొన్నారు. మహాసభల సందర్భంగా సిద్దిపేటలో మొదటి రోజు ప్రజాప్రదర్శనభారీబహిరంగ సభనిర్వహించబడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. ఆంజనేయులు తెలిపారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్లను సీపీఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులుఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపట్టిన ప్రజా ఉద్యమాలు, సాధించిన విజయాలపై మహాసభలో చర్చించిభవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటారని అన్నారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, బివి. రాఘవులు హాజరైతారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా నాయకులు కానుగుల వెంకటయ్య, పార్టీ నాయకులు బొల్లె జగన్, లక్పతి, లి.బక్కయ్య, మహేష్ పాల్గొన్నారు.



రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## శ్రీప్రహర్ష ట్రస్ట్ క్రీడా పోటీలు

**చిన్నంబావి, జనవరి 15 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో శ్రీ ప్రహర్ష దేవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చిన్న మల్లయ్య ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా గ్రామంలో క్రీడలు ముగ్గుల పోటీలు, బ్యాడ్మింటన్, క్రికెట్ నిర్వహించడం జరిగింది. క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చిన్నంబావి మండల బిజెపి అధ్యక్షులు జగ్గారెడ్డి మాట్లాడుతూ... క్రీడలు స్నేహపూర్వకంగా ఉండాలని, గెలుపోటములు సహజమని, మానసిక ఉల్లాసానికి, యువతలో ఉన్నప్రతిభను వెలికితీ యడానికి క్రీడలు అవసరమని ఆయన అన్నారు. అనంతరం పై క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ బహుమతులు సీల్డు నగదు బహుమతి అందజేయడం జరిగింది. శ్రీ ప్రహర్ష దేవి చారిటబుల్ ట్రస్టు ఫౌండేషన్ సేవ కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్న మల్లయ్య, సాయి ప్రణీత్‌గౌడ్, శ్రీధర్ రెడ్డి, క్రాంతికుమార్, సుదర్శన్, దర్వన్, నాయుడు, ఉమేష్, అకుల వెంకటేష్, లక్ష్మినారాయణ, తడకల శ్రీను, శివ యాదవ్, డ్రైవర్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలిచిన డబ్బులు.. నిరుపేద కుటుంబానికి సాయం

**నారాయణపేట టౌన్, జనవరి 15 (ప్రభాతవార్త):** దామరగిద్ద మండలం కాన్‌కుర్తి గ్రామానికి చెందిన బిచ్చలి అశోక్ అనే యువకుడి తల్లి రెండురోజుల కిందట మృతి చెందింది. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు రూ.11 వేల బహుమతి సాధించారు. బహుమతిగా వచ్చిన డబ్బులను తోటి మిత్రుడి బీదరికాన్ని గుర్తించిన స్నేహితులు వచ్చిన రూ.11 వేలమృతురాలు కుమారుడు అశోక్ అందజేశారు. బహుమతిగా వచ్చిన డబ్బులను అందించడం పట్ల గ్రామస్తులు ఆ జట్టు యువకులను గ్రామస్తులు అభినందించారు. నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి స్నేహానికన్న మిన్న లోకాన లేదురా అని నిరూపించుకున్నారు.

## ఘనంగా ప్రభోత్సవం

**ఉప్పునుంతల, జనవరి 15 (ప్రభాతవార్త):** మండల కేంద్రమైన ఉప్పునుంతల శ్రీ కేదారేశ్వర ఆలయం నుంచి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రభోత్సవం నిర్వహించారు. శ్రీశైలం ఉత్తర ద్వారమైన శ్రీఉమామహేశ్వర ఆలయంలోగురువారం వేకువజామున జరిగే కళ్యాణోత్సవానికి విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో ప్రభోత్సవం భారీ ర్యాలీ తో శ్రీ ఉమామ హేశ్వర ఆలయానికి తరలి వెళ్ళింది. గ్రామంలో అన్ని ప్రధాన రహదారులగుండా ఊరేగింపుతో శ్రీ ఉమామ హేశ్వర కళ్యాణోత్సవానికి తరలి వెళ్ళింది. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీనిర్వాహకులు, గ్రామస్తులు, పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందుఆలయంలోప్రత్యేకపూజలు చేశారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు

**చిన్న చింతకుంట, జనవరి 15 (ప్రభాతవార్త):** కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బోయ బాలప్ప అకాల మరణం చెందడంతో బుధవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. కాంగ్రెస్ కార్యకర్త మృతి గురించి స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందనివారి కుటుంబానికి భరోసా ఇవ్వడం జరిగిందని నాయకులు తెలిపారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నేతలు ఆర్థిక సహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్‌పార్టీ గ్రామఅధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి, గౌని విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనువాసురెడ్డి, కోదండ, కెకురుమూర్తి పాల్గొన్నారు.

## మహిళలకు చీరల పంపిణీ

**చిన్నచింతకుంట, జనవరి15 (ప్రభాతవార్త):** కౌకుంట్ల మండలంలోని అప్పంపల్లి గ్రామంలో బుధవారం మాసన్న మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని, బాలమ్మ జ్ఞాపకార్థం పేద మహిళలకు చీరలను ఫౌండేషన్ వ్యవస్థాపకులు గడ్డం శంకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను సంపాదించిన లో కొంత పేదలకు సహాయం చేయడంలో ఎంతో సంతృప్తి ఇస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం సుదర్శన్, గడ్డం కమలాకర్, గడ్డం భగవాన్, మాజీ సర్పంచ్ నెల్లి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొయ నరసింహ, గ్రామస్తులు భాష, కురువ శీను, కురుసలి అంజన్న, రాజారెడ్డి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గంటెల మన్నెమ్మ స్మారక క్రికెట్ టోర్నమెంట్

**మూసాపేట్, జనవరి 15 (ప్రభాతవార్త):** మండలంలోని చక్రపూర్ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గంటేల మన్నెమ్మ స్మారక క్రికెట్ టోర్నమెంట్ కుమారులు గంటల సత్య నారాయణ రమేష్ నిర్వహించారు ప్రథమ బహుమతి వివేకానందటీం 5000రూపాయలు గెలుపొందగా రెండవ బహుమతి డియర్ కామ్రేడ్స్ 2500 రూపాయలను గెలుపొందారు. ఈ సందర్భంగా ఇలాంటి క్రీడా కార్యక్రమాన్ని నిర్వహించినందుకు గంటల రమేష్‌ను గ్రామ పెద్దలు అభినందించారు. అనంతరం గంటల లక్ష్మినారాయణ మాట్లాడుతూ పండుగ సమయంలో బయట తిరగకుండా ఊర్లోనే ఉండి క్రీడా కార్యక్రమాలు శ్రీకారం చుట్టినందుకు టోర్నమెంట్ దగ్గరుండి మేనేజ్మెంట్ చేసిన గోపాల్ గౌడ్ మహేందర్ గౌడ్ చల్ల రాజేష్, శ్రీశైలంగౌడ్, కురుమూర్తి, వివేకానంద టీమ్ యువకులను అభినందించారు ప్రతి పండుగ సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు ఎప్పుడు నిర్వహించాలని యువకులకు గ్రామ పెద్దలు సూచించారు ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు చిన్న బాలన్న, మాజీ సర్పంచ్ గంటల రఘురాములు, ప్రభుత్వ ఉద్యోగి ఏటిఓ రవీందర్‌గౌడ్, ఆర్ఐ కురుమూర్తి, గంటేలా సాయన్న, చల్లసురేష్, నాగయ్య, సల్ల రమేష్, గజ్జలి నాగరాజు, టి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

**మాజీ ఎంపీటీసీ అంజిలప్ప**

**నారాయణపేట టౌన్, జనవరి15 (ప్రభాతవార్త):** యువత చదువుతోపాటు క్రీడల్లోను రాణిస్తే ముమ్ముందు మంచి భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎంపీటీసీ అంజిలప్ప అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా దామరగిద్ద మండలం కందెన్ పల్లి గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని భావించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ముమ్ముందుమంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడల్లో రాణించిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. చదువుకు పేదరికం అడ్డు కాదని గ్రామస్థాయి క్రీడలకు పరిమితం కాకుండా జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచాలన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. లక్ష్యసాధనతో ముందుకు సాగితే అనుకున్న గమ్యాన్ని సులభంగా చేరుకోవచ్చు అన్నారు. ప్రతి విద్యార్థికి రాణించాలని తపన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## ముగ్గులతో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసన



**వనపర్తి క్రైమ్ జనవరి 15 ప్రభాతవార్త :** సంక్రాంతి పండగ సందర్భంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ లు అమలు కావడంలేదని పండగ రోజైన మంగళ, బుధవారాలలో వనపర్తి జిల్లా మాజీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ఇంటి ముందు ముగ్గులు వేసి ముగ్గుల ద్వారా కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత చాటుకున్నారు.మండల బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులఇంటి ముందువాకిళ్లలో ముగ్గులరూపంలో కాంగ్రెస్ పార్టీకి ప్రశ్నల వర్షం కురిపించారు. వాళ్లు వేసిన ముగ్గులుఈ విధంగా ప్రజలకువింతగా దర్శనమిచ్చాయి. ఏది ఏమైనాఎలాగైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు వదలమని మాజీ ప్రజా ప్రతినిధులు మాజీ వైస్ మున్సిపల్ చైర్మన్ వాకిటి శ్రీధర్ తెలిపారు. హామీలన్నీ అమలు అయ్యే వరకు ఇలాగే ప్రశ్నిస్తామని అన్నారు. ప్రతి ముగ్గులో రైతు భరోసా, రుణమాఫీ, తులం బంగారం,మహిళలకు 2500,ఇందిరమ్మ ఆత్మీయభరోసా, నిరుద్యోగ భృతి, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, అంబేద్కర్ అభయహస్తం,వంటి అమలుకానీ హామీలపై మండల ప్రజలు ముగ్గుల రూపంలో వారిఆవేదన వ్యక్తం చేస్తూ పథకాలన్నీ భోగి మంటల్లో కలిపేసిన రేవంత్ అంటూ ప్రభుత్వం పై మండిపడ్డారు. ఈ పండగ సందర్భంగా ప్రభుత్వం పై వ్యతిరేక ముగ్గులు దర్శనమిచ్చాయి

## అప్పరాల ఆలయంలో ప్రత్యేక పూజలు

**కొత్తకోట జనవరి 15 ప్రభాతవార్త :** కొత్తకోట మండలం అప్పరాల, రామకృష్ణాపురం గ్రామంలో సుందరగిరి పరమేశ్వర స్వామి జాతర ఉత్సవాల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సతీమణి కవిత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా గ్రామ నాయకులు ఆలయ నిర్వాహకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. పూజ అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, రామకృష్ణ పురం మాజీ సర్పంచ్ శివరాములు, చర్లపల్లి శేఖర్ రెడ్డి, మాసన్న, మండల అధ్యక్షులు బిచుపల్లి యాదవ్, కృష్ణ రెడ్డి, రావుల కర్ణాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మేస్త్రి శ్రీను, గోకరయ్య, సంజీవుడు, వెంకటేష్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి పరామర్శ

**కొత్తకోట జనవరి 15 ప్రభాతవార్త :** కొత్తకోట మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ నవీన్ కుమార్ తల్లి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నేత రావుల కర్ణాకర్ రెడ్డి అత్యంత సన్నిహితుడు, స్నేహితుడు నవీన్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి సంతాపం వ్యక్తం చేశారు. ముందుగా చనిపోయిన సుబేదమ్మాకు నివాళ్లు అర్పించారు. అనంతరం కుటుంబానికి అన్ని విషయాల్లో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కానాయపల్లి మాజీ ఉప సర్పంచ్ గోకరయ్య, కృష్ణారెడ్డి, సంజీవుడు, మిక్సన్, అమర్, ప్రదీప్, అనిల్, ఎల్లన్న, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప నామస్మరణతో మారుమోగిన ఆత్మకూర్

**ఆత్మకూరు జనవరి 15 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో నూతనంగా నిర్మించినటువంటి అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం రోజు అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. ఆత్మకూరు పట్టణంతో పాటుగా సమీపంలోని పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు శబరిమల తరలి వెళ్లేందుకుగాను మంగళవారం రోజు పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్ అయ్యప్పస్వామి గుడి నిర్వాహకులు గాడి లక్ష్మినారాయణ నేతృత్వంలో ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. శబరిమల వెళ్లేందుకుగాను నిర్వహించిన ఇరుముడి కార్యక్రమం కోసం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో అయ్యప్ప నామస్మరణతో మారుమోగిపోయింది అనంతరం ఇరుముడి తలకెత్తుకున్న అయ్యప్ప స్వాములు శబరిమల వెళ్లేందుకుగాను మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్ అయ్యప్ప స్వాములకు వీడ్కోలు పలికారు.

## ముగిసిన చింతలకుంట ఆంజనేయస్వామి ఉత్సవాలు

**పెబ్బేరు జనవరి 15 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలోని పాత పల్లి గ్రామంలో చింతలకుంట ఆంజనేయస్వామి సంక్రాంతి సందర్భంగా మూడు రోజులు ఘనంగా ఉత్సవాల్లో జరిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఇక్కడ స్వామివారికి నైవేద్యంగా కళ్ళు, కోళ్లు, మేకలు సమర్పించి ముక్కులు తీర్చుకుంటారు. సంక్రాంతి పండుగ రోజు మూడు రోజులపాటు ఇక్కడ ఉత్సవాలు బ్రహ్మాండంగా జరిపారు.

## నేడు నవోదయ మాదిరి ఉచిత పరీక్ష

**ఆత్మకూరు జనవరి 15 ప్రభాతవార్త :** ఈనెల 18వ తేదీన నవోదయ పాఠశాలల్లో ప్రవేశం పొందేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్ననవోదయ పరీక్షను సమర్థవంతంగా విద్యార్థులు ఎదుర్కొనేందుకు గాను ఆత్మకూరు పట్టణంలో నేడు నవోదయ మాదిరి ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లుగా నిర్వాహకులు మీర్జా అన్వర్ బేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు నవోదయ పాఠశాలల్లో ఆరవ తరగతిలో ప్రవేశం పొందేందుకుగాను నిర్వహించే పరీక్షలకు సన్నద్ధం చేసేందుకుగాను ఆత్మకూరులోని లిటిల్ ఫ్లవర్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో కోచింగ్ నిర్వహించడమే కాకుండా విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత మాదిరి పరీక్షను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన తెలిపారు.

## తోమాలపల్లిలో ముగిసిన క్రికెట్ పోటీలు

**పెబ్బేరు జనవరి 15 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం తోమాలపల్లి గ్రామంలో సంక్రాంతి పర్వదిన సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రికెట్లో గ్రామ యువకులు ఉత్సాహంగా పాల్గొని గెలుపొందడం జరిగింది. విన్నర్ ఎస్వీ మిత్ర,రన్నరు బుల్లెట్ పై ఎస్వీమిత్ర టీం గెలుపొందడం వీరికి నగదు తో పాటు షీల్డ్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కెప్టెన్ శేఖర్, సతీష్, కె రాముల నాయుడు, కృపాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, పాలెం శేఖర్ ,శ్యామ్, రామ యువకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని క్రికెట్ పోట్లను విజయవంతంగా నిర్వహించారు.

## పసుపు బోర్డు ఏర్పాటు పై హర్షం

### కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి

**కొత్తకోట జనవరి 15 ప్రభాతవార్త:** పసుపు బోర్డు ఏర్పాటు తెలంగాణ రైతుల విజయమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పియూష్ గోయల్ చేతుల మీదుగా మంగళవారం నిజామాబాదులో జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేయడం పట్ల వనపర్తి జిల్లా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి హర్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పసుపు రైతుల తరపున కృతజ్ఞతలు తెలుపుతూ పదకొండెళ్ల నిరీక్షణ తర్వాత నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పసుపు బోర్డు కు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం హర్షనీయమని పసుపు బోర్డు వల్ల రైతులకుఎంతో మేలు చేకూరుతుందని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి పసుపు రైతుల ప్రయోజనాల కోసం బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి కిసాన్ కాంగ్రెస్ తరపున చాలాసార్లు విజ్ఞప్తులు చేయడం జరిగిందని గుర్తు చేశారు. కేవలం పార్లమెంట్ ఎన్నికల హామీ లాగా మిగిల్చకుండా నిజామాబాదులో పసుపు బోర్డును ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు. పసుపు పండించే రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు సరఫరా చేయాలని కొత్త వంగడాలను రూపొందించాలని సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నాను. రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు పసుపు రైతుల చిరకాల ఆకాంక్ష అని, రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని, కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేయడం హర్షణీయమని అని అన్నారు.

## ఘనంగా మాయావతి 69వ జన్మదిన వేడుకలు

**ధన్వాడ, జనవరి 15 ప్రభాతవార్త:** బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బెహన్ కుమారి మాయావతి 69వ జన్మదిన వేడుకలు నారాయణ పేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో దన్వాడలోనీ అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి దొడ్డే సమ్మయ్య,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాతంగి అశోక్ హాజరై పార్టీ నాయకులూ కార్యకర్తలకు స్వీట్లతో వేడుకలు చేసుకోవడం జరిగింది .అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించడం మరియు దానిని అమలు చేయడం కోసం తన జీవిత సమస్తాన్ని ధారబోసిన బహుజన యోధుడుమాన్యవర్ కాన్షిరాం గారి మార్గంలో, ఆయనలాగే తన సమస్తాన్ని బహుజన సమాజం కోసం ధారబోసి బహుజన ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న బిఎస్పి జాతీయ అధ్యక్షురాలు బెహన్ జీ కుమారి మాయావతి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కావాలి రవి యాదవ్,మండల కో ఆర్డినేటర్ గుర్రం రాజు, నియోజకవర్గ నాయకులు అరవింద్, మైనారిటీ కన్వీనర్ సయ్యద్ మహమూద్, మండల కోశాధికారి జడల బాల్ రాజ్,సోషల్ మీడియా ఇంచార్జ్ అశోక్,బీఎస్పీ నాయకులు తిరుమలేష్,అజయ్ కుమార్, గోపినాయక్, వెంకటేష్, తిరుపతి, రామాంజనేయులు, వెంకటయ్య, బాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థిక సహాయం

**ధన్వాడ, జనవరి 15 ప్రభాతవార్త:** ధన్వాడ గ్రామానికి చెందిన ఎంబిబిఎస్ మూడక్వ మొదటి సంవత్సరం చదువుతున్న సుష్మిత అనే విద్యార్థినికి తన వంతు సహాయంగా రూ. 10000 బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రవీణ్ రెడ్డి విద్యార్థిని తండ్రి రామాంజనేయులుకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని ఉన్నత విద్యకు తన వంతు సహాయం అందించానని, ఆమె వైద్య రంగంలో ఉన్నత స్థితిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు కురుమూర్తి, చక్రి, రవి, నారాయణ, సుధాకర్, చరణ్ దాస్ పాల్గొన్నారు.

# అంబురాన్నంటిన సంక్రాంతి సంబురాలు



రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు





ఎద్దుల బండ్లను ఊరేగిస్తున్న రైతులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 15, ప్రభాతవార్త:** సంక్రాంతి అక్షరంలో సం అంటే మంచి అని, క్రాంతి అంటే కాంతి అనే భావంతో తెలుగు పండుగల్లో సంక్రాంతి పండుగ ప్రత్యేక స్థానాన్ని సంపాదిం చుకుంది. అలాంటి సంక్రాంతి పర్వ దిన వేడుకలను ప్రజలు భోగి మంట లతో స్వాగతం పలికి, సంక్రాంతి, కనుమవేడుకలనుఆనందభరితంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో బంధు మిత్రులతో ఘనంగా నిర్వహించుకున్నారు. రంగు వల్లులు, రతనాల గొబ్బిళ్లు, పువ్వులు, ఘుమఘుమలాడే పిండి వంటలు, ఇంటి నిండా చుట్టాలతో సంబురంగా జరుపు కున్నారు. ప్రజలు సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని పట్టణాలను వదిలి సొంతింటికి విచ్చేసి మూడు రోజుల పాటు పండుగ సంబురాల్లోమునిగి తేలారు.మూడు రోజుల పాటు ఉత్సాహంగా, ఉల్లాసంగాభక్తి భావాల మేలవింపు తో పండుగ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు నాగర్‌కర్నూల్,కల్వకుర్తి, అచ్చంపేట నియోజక వర్గాలోని అన్ని మండలాలతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబురాలను ప్రజలు ఘనంగా నిర్వహించు కున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలు, యువతులు ఇండ్ల ముందురంగు వల్లికలతో అందంగా అలంకరిం చారు.ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను రంగువల్లికల మధ్య ఉంచి బొడ్డమ్మలు కొడుతూ సంబురాల్లో మునిగిపోయారు. ఆరుగాలంకష్టపడి పండించిన వరిబియ్యంబెల్లంతో చేసినపుల గాన్ని వండి ఇష్టదైవానికి నైవేద్యాంగాసమర్పించారు.తమ తోబుట్టువులను, ఆడపడుచులను ఇళ్లకు ఆహ్వానించి అందరితో కలిసి భోగి మంటలతో ప్రారంభమై కనుమ వేడుకలతో పండు గనుఅంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు.ఆలయాల్లో ప్రత్యేక పూజలు,పాలు పొంగించడం, బెల్లంతో అన్నం చేసి దేవుడికి నైవేద్యంచేయడం లాంటి కార్యక్రమాలనునిర్వహించారు. సంక్రాంతి పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది గంగిరెద్దుల సందడి. పూర్వ కాలంలో గంగి ఒద్దుల సందడితోపండుగ వాతావరణం మొదలయ్యేది. సంస్కృతి, సంప్రదాయాలనుమరిచిపోకూడదనే ఉద్దేశంతో కొన్ని గ్రామాల్లో ప్రత్యేకంగాగంగిరెద్దులను తెచ్చిసందడి చేస్తూ పండుగ విశిష్టతను చాటి చెబుతున్నారు. వివిధ గ్రామాల్లో యువజన సంఘాల ఆధ్వర్యంలో యువతులకు ముగ్గుల పోటీలను నిర్వహిం చిన గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ప్రత్యేక ంగా చిన్నారులుగాలి పటాలుఎగురవేస్తూ పండుగ సంబురాలను ఘనంగా నిర్వహించుకున్నారు.ఇళ్లలో కుటుంబ సభ్యులతో పండుగ వాతావరణం మరింత ఆహ్లాదకరంగా మారింది.

**భూత్పూర్,జనవరి 15,ప్రభాతవార్త:** మూడ్రోజుల తెలుగింటి పెద్ద పండుగ సంక్రాంతి సంబరాలు ఊరూరా ఘనంగా నిర్వహించారు. మూడో రోజు కనుమ గ్రామాలు,పట్టణాలలో నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి.గ్రామాలో రైతులు తమకు జీవనాధారమైన కాడెద్దుల్ని అందంగా అలంకరించి,వాటిని పూజించి దేవాలయాల చుట్టూ ఎద్దుల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్ లో ఉన్న నూతన దేవాలయంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆయన సతీమణి మంజుల వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కొత్తమొల్గర,కప్పెట,వెల్కిచర్ల, భట్టుపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎద్దుల బండ్లప్రదర్శనలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతి రెడ్డితో పాటు నాయకులు మొల్గర వెంకటేష్,దెందిలక్ష్మికాంత్‌రెడ్డి, వడ్డె శ్రీనివాసులు పాల్గొన్నారు. భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో ఎద్దులబండ్ల ప్రదర్శన నిర్వహిస్తున్నారు.మున్సిపాలిటీలోని గోప్లాపూర్‌లో నిర్వహించిన ఎద్దుల బండ్ల ప్రదర్శనలో బీఆర్ఎస్ నాయకులు మేకల సత్య నారాయణ,తూము శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మూడ్రోజుల పాటు నిర్వహించిన సంక్రాంతి సంబురాల్లో కొన్నిగ్రామాలు,పట్టణాలలో ఆయాదేవాలయాల్లో ప్రత్యేక పూజలు,ప్రత్యేక అలంకరణలతో పాటు ముగ్గుల పోటీలు,ఎద్దుల బండ్ల ప్రదర్శనలుకన్నుల పండువగానిర్వహించారు.ఊరూరా సంక్రాంతి సంబురాలు చూడ ముచ్చట గొలిపాయని చెప్పకతప్పదు

**మద్దూర్, జనవరి15 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూరు మండల పరిధిలోని ఆయా గ్రామాలు గత మూడు రోజుల నుంచి సంక్రాంతి పండుగను మండల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు పిండి వంటలు చేసి ముగ్గులు వేసి చిన్నారులు పతంగులు ఎగరవేయడం కొన్ని గ్రామాలు సౌండ్ బాక్స్ లు పెట్టి గ్రౌండ్లలో పతంగులు ఎగరవేయడం జరిగిందని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు.

**బిజినపల్లి, జనవరి15 ప్రభాతవార్త:** మండలంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పండగ శోభతో లోగిళ్లు కళకళలాడాయి. మంగళవారం సంక్రాంతి పర్వదినాన ఊరూవాడా తెల్లవారు జామునే సందడి నెలకొంది. ఏడాదంతా సుఖ శాంతులతో ఉండాలని, నవ ధాన్యాలు, సిరి సంపదలు కలగాలని కోరుకుంటూ,కొత్త కాలానికి స్వాగతం పలుకుతూ, భోగిమంటల చుట్టూ చిన్నాపెద్దా కేరింతలు కొట్టారు.మన సంస్కృతి సాంప్రదాయాలు నేటి తరానికి అందిచాలనే లక్ష్యంతో వారిని సంక్రాంతి పండుగలో భాగస్వామ్యం చేశారు. పిల్లలకు పండగ విశిష్టత, సంప్రదాయాలను తెలియజేశారు.పిల్లల ఆట పాటలు, గాలిపటాలఎగురవేసే దృశ్యాలతో సంక్రాంతిసంబరాలు అంబరాన్నంటాయి. పిల్లలు, స్నేహితులు, బంధువులు, కొత్త అల్లుళ్లతో ఇంటింటా సంక్రాంతి సందడిని తెచ్చింది. రైతులు ఎద్దులబండ్లను ట్రాక్టర్లను అలంకరించి గ్రామాల్లోని ఆలయాల వద్ద ప్రదక్షిణలు చేశారు. గిరిజనతండాల్లో సంక్రాంతి సంబరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంబరాల్లో భాగంగా క్రికెట్ ,వాలీబాల్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

**నారాయణపేట టౌన్, జనవరి 15 ప్రభాతవార్త :** సంక్రాంతి పండుగ వేడుకలను నారాయణపేట పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మూడు రోజుల పండుగ ఎంతో ఆనందంగా జరుపుకున్నారు. సంక్రాంతి మన జీవితాలలో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ భోగి పండుగ భోగ భాగ్యాలు తీసుకురావాలి, సందడి తీసుకురావాలని, కనుమ మధురమైన జ్ఞాపకాలను అందించాలని కోరుకుంటూ పండుగ వేడుకలు వైభవంగా జరుపుకున్నారు.వేడుకల్లో పిండివంటలు, మాంసాహార భోజనాలు ప్రత్యేకత. ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు బొబ్బెమ్మలు ఆకర్షణీయం. గ్రామీణ ప్రాంతాల్ల ముగ్గుల పోటీలు, ఆటల పోటీలునిర్వహించి బహుమతులు అందజేశారు.కాగా ఉత్తరాయణ పుణ్యకాలమైన సంక్రాంతి రోజు చేయు ఏ దానమైన శ్రేష్టమైనదని భావిస్తారు. ముఖ్యంగా ధాన్యం, ఫలాలు, విసనకర్ర, వస్త్రం, కాయగూరలు,దుంపలు, నువ్వులు, చెరుకు మొదలగునవి దానం చేయడం వలన మంచి చేకూరుతుందని ప్రజలు విశ్వసిస్తారు.

**పేద ప్రజలకు సొంత ఇంటి కల**

# ఇందిరమ్మ ఇళ్లతో సాధ్యమవుతుంది

● గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

**గద్వాల జనవరి 15 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల మండలం సంబంధించిన గద్వాల ఎంపీడీఓ కార్యాలయంలో, ధరూర్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో నందు ఇందిరమ్మ ఇల్లు మోడల్ నమూనా నిర్మాణానికి శంకుస్థాపన భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కి నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. గద్వాల, ధరూర్ మండలాలో ఇందిరమ్మ ఇల్లు మోడల్ నమూనా నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపనకు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎన్నికలలో సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజలకు ఇస్తామని చెప్పిన మాట ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం నందు పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు నమూనా మోడల్ నిర్మాణాన్ని తయారుచేసి ఐదు లక్షల రూపాయలలో ఒక హాలు, బెడ్ రూమ్ కిచెన్, నిర్మాణం చేసి నిర్మాణంచేసి పేద ప్రజలకు చేయించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు కేటాయించడం జరిగిందన్నారు. వీటిలో భాగంగానే ఇందిరమ్మ ఇల్లు కొరకు నమోదు చేసుకున్న వారికి త్వరలోనే ప్రతి గ్రామంలో, గ్రామ సభలను ఏర్పాటు చేసి వీటిలో అర్హులైన వారికి ఎంపిక చేసి మొదటి విడతలు వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు.అదేవిధంగా భవిష్యత్తులో కూడా మరి కొంతమందికి కూడా ఇందులో మహిళలు మంజూరు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, జి వేణుగోపాల మాజీ ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, మాజీ జెడ్పిటిసి పద్మ వెంకటేశ్వర్‌రెడ్డి,మాజీ వైస్‌ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, ఆలయం కమిటీ చైర్మన్ బోయ వెంకట రాములు, ఆలయం కమిటీ మాజీ చైర్మన్ సతీష్, జిల్లా సర్పంచులుమాజీ అధ్యక్షుడు మాజీద్, కౌన్సిలర్స్ మురళి, పూడూరు కృష్ణ, శ్రీను, సుధాకర్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఆంజనేయులు, ఆలయం కమిటీ డైరెక్టర్ వెంకటేష్, మాజీ సర్పంచ్లు అశోక్ రెడ్డి, లక్ష్మికాంత్ రెడ్డి, సత్యనారాయణ, విజయభాస్కర్ రెడ్డి, వీరన్న గౌడ్ శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ రాఘవేంద్ర రెడ్డి, దౌలన్న నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఉరుకుందు,డి.ఆర్ విజయ్,రామన్న, గోవిందు, కురుమన్న,ధర్మ నాయుడు, దౌలన్న, నాగేంద్ర యాదవ్, వెంకటన్న గౌడ్, ప్రవీణ్, కేశవరెడ్డి నరేందర్, రెడ్డి, రఘు నాయుడు, కరెప్ప, వీరేష్,గాంధీ,సంజీవ్, జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ పురుషోత్తం రెడ్డి, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీఓ లు నాయకులు కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం

● నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట టౌన్, జనవరి 15 ప్రభాతవార్త :** మహిళలు, యువతులు,బాలికలు ఆకతాయిల వలన గానీ, మరే విధమైన వేధింపుల వలన గానీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, గృహహింసకు గురైన ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థినులు బస్టాండ్ల దగ్గర, గ్రామాలలో, కాలనీలలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ లకు గురైనా, ఉద్యోగ మహిళలు పని చేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైనా, బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే నిర్భయంగా షీ టీమ్ పోలీసులను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తామని ఎస్పీ తెలిపారు. షీటీమ్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగాఅవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా షీటీమ్స్ ద్వారా మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్బుక్, వాట్సాప్,ఇన్స్టాగ్రామ్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని, వాటి లో ఫోటోలు, వీడియోలు పోస్టుచేసే సమయం లో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్నిరకాల జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు 871267 0398 ఫోన్ నంబరుకులేదా డయల్ 100కుఫోన్ చేసి సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగాఉంచడం జరుగుతుందని అట్టివ్యక్తులపైచట్టప్రకారం కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

## పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ డికె అరుణ

**మహబూబ్‌నగర్, జనవరి 15 ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగ, కనుమ పండుగ మీ అందరి ఇళ్లలో సంతోషాలు నింపాలని... తరాలు మారినా... తరగని అనుబంధాలతో.. పాడి పంటలతో..ప్రజలంతా సుఖంగాఉండాలని కోరుకుంటున్ననట్లు ఎంపీ డీకే అరుణ తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాల వెలుగు విరాబూయాలని.. ఆనందో త్సాహల నడుమఈ పండుగ చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ రాష్ట్ర ప్రజలందరికి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థికి అభినందనలు

**మద్దూర్, జనవరి 15 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా స్థాయిలో నిర్వహించిన సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్షలో ఉమ్మడి మద్దూరు మండలం భూనీడ్ గ్రామానికి చెందిన ఎన్. పవన్ 2 వ ర్యాంకు సాధించారు. విద్యార్థి ప్రతిభను గుర్తించి బొంబాయి వెంకట్‌రెడ్డి ప్రోత్సాహకంగా రూ.2000 అదే విధంగా పిఆర్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ టీచర్ రూ.500 ఆర్థిక సహాయం విద్యార్థి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## వైభవంగ మైసమ్మ ఉత్సవాలు

**మద్దూర్, జనవరి 15 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని చెన్నారెడ్డి పల్లి శివారులో వెలసిన బులెమోని మైసమ్మ జాతర ఉత్సవాలను ఆ గ్రామస్తుల ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా జరుపుకున్నారు. రెండు రోజులఉత్సవాల్లో భాగంగామంగళవారం ఉదయం అమ్మవారికి గ్రామస్తులంత కలిసి జల్దీ బిందెతో శుద్దనీరు తెచ్చి జలాభిషేకం చేశారు. అక్కడ అమ్మవారికి పంచామృతాభిశేకం ,ఫల,పుష్ప,పట్టు వస్త్రాలంకరణచేసి నైవేద్యం సమర్పించారు.ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను మాజీ జడ్పీటీ రఘుపతి రెడ్డి,మాజీ సర్పంచ్ హన్మిరెడ్డి తో కలిసి ప్రారంభించారు. సాయంత్రం అమ్మవారికి నైవేద్యంతో బోనమెత్తి డప్పులు,కురువల బ్యాండ్ మేళాల తో ర్యాలీగావెళుతూ ఆలయానికి చేరుకొని ప్రత్యేకపూజలు చేశారు.బుధవారంఅమ్మవారికి మేకలు,కోళ్ళను బలిఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ అన్నాదానం చేశారు.సాయంత్రం వరకు కొనసాగిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన టీమ్ సభ్యులకు ఫస్ట్ ,సెకండ్ ప్రైజ్‌లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు ఇతరప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండపేట శ్రీలక్ష్మి నరసింహ స్వామికి పట్టు వస్త్రాలు

**స్వామివారికి సమర్పించిన పోతురాజు సోమనాద్రి దంపతులు**

**ఇటిక్యాల, జనవరి 15 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొండపేట గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మినరసింహస్వామి వారి కల్యాణోత్సవంలో కొండేరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకుడు పోతురాజు సోమనాద్రి ఆయన సతీమణి డా. హరిత స్వామివారి కల్యాణోత్సవం లో పాల్గొన్నారు. అదేవిధంగా స్వామివారికి పట్టు వస్త్రాలు, పుస్తె మెట్టలు కూడా సమర్పించారు. అనంతరం పోతురాజు సోమనాద్రి, ఆయన సతీమణి డా. హరితను స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి మెమొంటోను ఆలయ నిర్వాకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ లక్ష్మినరసింహస్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొనడం చాలా అదృష్టంగా భావిస్తున్నామన్నారు.అదేవిధంగా మకరసంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల పరిధిలోని జింకలపల్లి గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన మహిళలకు వివిధ బహుమతులను కొండేరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు పోతురాజు సోమనాద్రి ఆయన సతీమణి డాక్టర్ హరిత మాజీ జెడ్పిటిసి లలిత తో కలసి బహుమతులను అందజేశారు.

## సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల సేకరణ

**ఇటిక్యాల, జనవరి 15 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్దదిన్నె గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన దేవాదాయ శాఖకు చెందిన 96 ఎకరాల భూమి కలదు. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం బుధవారం ఆ భూమిని తాహసిల్దార్ నరేందర్. విద్యుత్ ఎఇ శేఖర్, ఆర్ఐ బీమ్ సేన్ రావు, సర్వేయర్ డౌలమ్మ, ఏపీఎం కురుమన్న, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ జయసింహయ్య తదితరులు కలిసి దేవాదాయ శాఖకు చెందిన భూమి సర్వే నంబర్ 66 నుండి 83 వరకు దాదాపు 96 ఎకరాల భూమి ఉండగా ఆ భూమిని వారు సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అనువుగా ఉంటుందని స్థల సేకరణ చేశారు. ఈ భూమిని సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తాహ సిల్దార్ నరేందర్ తెలిపారు. అలాగే ఇప్పటికే సాతర్ల గ్రామంలో సర్వేనెంబర్ 110 లో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా అభం ఆ భూమిని కూడా సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తహసిల్దార్ తెలిపారు. అయితే సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములలో ఏర్పాటు చేయాలంటే విద్యుత్తు ఉప కేంద్రాలకు 3 కిలోమీటర్ల పరిధిలో ఉండే విధంగా ప్రభుత్వ భూములను సేకరించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు ఉన్నట్లు తాహ సిల్దార్ నరేందర్ తెలిపారు.

## ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి

**బాలానగర్, జనవరి 15 ప్రభాతవార్త :** బాలానగర్ మండలం తిరుమలగిరి గ్రామపంచాయతీ పరిధిలో గల శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో బిఆర్ఎస్ నాయకులు అభిమన్యు రెడ్డి కూడా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి తేరు లాగడం, మంగళవారం ఉదయం స్వామివారి పల్లకి సేవ, సాయంత్రం బండ్లు తిరిగే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి మరియు మంగళవారం మధ్యాహ్నం పలువురు భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్ పర్సన్ కుటుంబాన్ని పరామర్శించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**పెబ్బేరు జనవరి 15 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణంలోని మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణశ్రీ సాయినాథ్ కుటుంబాన్ని పరామర్శించిన బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ అడిషనల్ డీ జీ పీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇటీవల ఎద్దుల సాయినాథ్ తండ్రి ఎద్దుల రాములు మృతి చెందిన విషయం తెలుసుకొని పరామర్శించడానికి వచ్చినట్లు సాయినాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రేస్వామి, కౌన్సిలర్లు చిన్న ఎల్లారెడ్డి, గోపి బాబు, పట్టణ అధ్యక్షులు దిలీప్ కుమార్ రెడ్డి, ఎం రాజశేఖర్, బిసన్న, రాములు, వెంకటేష్ పట్టణ బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పండగపూట విషాదం

## వేర్వేరు ఘటనల్లో ఐదుగురు దుర్మరణం

**కల్వకుర్తి, జనవరి 15 ప్రభాతవార్త:** పండుగ పూట కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సుఖ సంతోషాలతో ఉన్న కుటుంబంలో ఒక్కసారిగా తీవ్ర విషాదం నెలకొంది. ఒకే ఊరికి చెందిన 2 కుటుంబాల సభ్యులు పని నిమిత్తం కల్వకుర్తికి వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లారు. మితిమీరిన వేగం ఇద్దరు యువకుల ప్రాణాలను బలిగొనగా, మరో ఇద్దరిని క్షతగాత్రులుగా మిగిల్చింది. వివరాల్లోకి వెళ్తే... బుధవారం కల్వకుర్తి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు జోగు బంగారయ్య (39), జోగు మహేష్ (39), జోగు నాగమ్మ, జోగు శ్రీపతిలు కలిసి గ్రామం నుంచి కల్వకుర్తికి వచ్చారు. తమ పని ముగించుకొని తిరిగి తోటపల్లి గ్రామానికి వెళుతున్న క్రమంలో వారు ప్రయాణిస్తున్న ఆటో కల్వకుర్తి మండల పరిధిలోని తుర్కలపల్లి గేటు సమీపంలోకి రాగానే ఎదురుగా కారు అతివేగంగా వస్తు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జోగు బంగారయ్య, జోగు మహేష్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. జోగు శ్రీపతికి కాలు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అలాగే జోగు నాగమ్మ 67 చేయి విరగడంతో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడు బంగారయ్యకు భార్య నవనీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.. అలాగే మరో మృతుడు మహేష్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు...

### తల్లడిల్లుతున్న తల్లి

తోటపల్లి గ్రామానికి చెందిన జోగు మహేష్ ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగించేవాడు. బుధవారం తన తల్లితోపాటు తమ సమీప బంధువులైన
జోగు శ్రీపతితో కలిసి తన ఆటోలో కల్వకుర్తికి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేష్ సంఘటన స్థలంలోనే మృతి చెందడంతో మహేష్ తల్లి నాగమ్మ తన కళ్ళ ముందే కొడుకు మృతి చెందడంతో ఆమె వేదన వర్ణనాతీతం. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వారిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా మహేష్ కు మెరుగైన వైద్య సేవ నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. సంఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### కల్వకుర్తిలో వ్యక్తి..

కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాదు చౌరస్తాలో మంగళవారం రాత్రి 9.30 గంటలకు పట్టణానికి చెందిన వీరుమళ్ళ చంద్రయ్య (65) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. సంఘటన వివరాలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు. మృతుడు చంద్రయ్య స్కూటీపై రోడ్డు దాటుతున్న సందర్భంగా జడ్చర్ల నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న బొలెరో వాహనం స్కూటీని ఢీకొట్టగా ప్రమద స్థలిలోనే మృతి చెందాడు. స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సంఘటనపై మృతుని కుమారుడు రాఘవేందర్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### చేపల వేటకు వెళ్లి ..

**నారాయణపేట టౌన్, జనవరి 15 ప్రభాతవార్త :** చేపల వేటకు వెళ్లి చెరువులో వ్యక్తి మృతి చెందిన సంఘటన లక్ష్మీపూర్ చెరువులో చోటుచేసుకుంది. అందుకు సంబంధించి పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కర్రల పాండు (38 ) ఈ నెల 13 తేదీ సోమవారం రోజు గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో చేపల వేట కోసం సాయంత్రం 6:30 గంటల సమయంలో తన భార్యకు చెప్పి వెళ్ళాడు. రాత్రి 8 గంటలు సమయం కావలసిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులతో పాటు పలువురు అదే సమయంలో చెరువు దగ్గరకు వెళ్లి చూడగా చెప్పులతో పాటు బట్టలు కనబడ్డాయి. విషయాన్ని గమనించిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులు విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం రోజు పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని చెరువును పరిశీలించారు. వ్యక్తి జాడ కనపడలేదు. చేసేదిలేక గజీతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా శవం లభ్యమయింది. శవాన్ని చూసిన కుటుంబ సభ్యుల్లో రోదనలు మిన్నంటాయి. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు శవాన్ని నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన పాండుకు భార్య లక్ష్మితో పాటు ఓ కుమారుడు, తల్లిదండ్రులు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

### అదుపుతప్పి కారు బోల్తా
#### నేలబండతండా యువకుడి మృతి

**బాలానగర్, జనవరి 15 ప్రభాతవార్త :** బాలానగర్ మండలం నేలబండ తండాకి చెందిన వద్యా ఉదయ్ కిరణ్ (23) కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో మృతి చెందాడు. పెద్దరేవల్లి గ్రామ పరిధిలోని తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలను నలుగురు స్నేహితులతో కలిసి తిలకించడానికి వెళ్లి, తిరిగి వస్తుండగా మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో అప్పాజిపల్లి సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. కారు వెనక సీట్లో కూర్చున్న ఉదయ్ కిరణ్ అక్కడికక్కడే మృతి చెందగా, మిగతా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఉన్న ఒక్క వారసుడు మరణించడంతో తల్లిదండ్రుల రోదనలు గ్రామస్తులను సైతం కంటతడి పెట్టించాయి. స్థానికుల సమాచారం మేరకు ఈ ప్రమాదానికి అతి వేగమే కారణమని తెలుస్తోంది.

## ఫేక్ లేఖ..

(మొదటి పేజీ తరువాయి)

చెందిన షేక్ రఫీక్, కమ్మరి భగవంతు, అదే గ్రామానికి చెందిన షాద్ నగర్ లో నివాసం ఉంటున్న ఆర్ఎంపీ డాక్టర్ మహ్మద్ షా అలీ,షేక్ తవ్ ఫిక్ లు కలిసి షాద్ నగర్ లోని ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరున ఒక లెటర్ ప్యాడ్ ను ప్రింట్ చేయించి బెదిరింపు లేఖను రాసి రంగారెడ్డి గూడలోని చిత్తనూరి రవికుమార్ ఇంటి గోడపై ప్రజలకు కనిపించే విధంగా షేక్ తవ్ ఫిక్ అతికించారని ఆమె వివరించారు. ఎన్నికలకు ముందు ఏ1 గా ఉన్న షేక్ రఫీక్ గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ,ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వెంబడి ఉండేవాడని, అనిరుధ్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచాక తనకు ఎలాంటి ఆర్థిక లాభం లేదని భావించి, బీఆర్ఎస్ పార్టీలో చేరి ఎమ్మెల్యే పై కోపం పెంచుకొన్నాడని తెలిపారు. ఆయన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించాలనే ఉద్ధేశ్యంతో మిగతా ముగ్గురిని కలుపుకొని ఈ పన్నాగం పన్నినట్లు ఆమె తెలిపారు. ఈ విషయాన్ని షేక్ రఫీక్ పై అనుమానం వ్యక్తం చేసి పోలీస్ స్టేషన్ లో విచారించగా, తాను చేసిన నేరాన్ని ఒప్పుకున్నట్లు ఆమె తెలిపారు. అతని దగ్గరే మిగిలిన 29 లెటర్ ప్యాడ్ లను స్వాధీన పరుచుకున్నారు. అనంతరం ఏ18283 లను అరెస్ట్ చేసి మూడు సెల్ ఫోన్లు 29 లెటర్ ప్యాడ్లు మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఇదిలా ఉండగా ఏ4 పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఎస్పీ జానకి నేతృత్వంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో మూడు రోజుల్లోనే మహబూబ్ నగర్ పోలీసులు కేసును ఛేదించి మరోమారు తమ ప్రతిభను చాటుకున్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల సీఐ నాగార్జున గౌడ్,కె.రవి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులను ఎంపిక చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ కమిషనర్లు బాధ్యత వహిస్తారని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు సంవత్సరానికి ఆదాయం, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల రూపాయలు సంవత్సరానికి ఆదాయం కలిగిన వారు మాత్రమే రేషన్ కార్డు పొందేందుకు అర్హులు అవుతారని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించే అధికారులు సిబ్బంది తప్పనిసరిగా ప్రభుత్వ ప్రమాణాలు మార్గదర్శకాలను అనుసరిస్తూ లబ్ధిదారుల ఎంపిక జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 16వ తేదీ నుండి 20వ తేదీ వరకు లబ్ధిదారుల సర్వేను పూర్తిచేయాలని, ఏ ఒక్క శాఖలో విధులు నిర్వహిస్తున్న ఏ ఒక్క అధికారికి, సిబ్బందికి సెలవులు మంజూరు చేయడానికి వీలు లేదని, కలెక్టర్ అనుమతి లేనిదే ఏ ఒక్కరికి సెలవులు ఇవ్వరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామస్థాయికి పరిశీలనకు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో లేకుంటే సస్పెన్షన్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా స్థాయి నుండి గ్రామస్థాయి వరకు అధికారులంతా క్షేత్రస్థాయిలో ఉంటూ ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ గూగుల్ మీట్ లో అన్ని శాఖల జిల్లా స్థాయి, మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు. అర్హులవుతారని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో గుర్తించిన లబ్ధిదారుల ముసాయిదా జాబితాను గ్రామసభలో చదివి ఆమోదం పొందాల్సి ఉంటుందన్నారు. ఆహార భద్రత కార్డులు రేషన్‌కార్డులు లేని కుటుంబాల జాబితాను డోర్ టు డోర్ సర్వే ద్వారా క్రోడీకరించి క్షేత్రస్థాయి పరిశీలనకు మండల స్థాయిలో మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారి (ఎంపీడీఓ), పట్టణ స్థాయిలో నమోదై 2023-24లో కనీసం 20 రోజులు పనిచేసిన కూలీలు ఈ పథకానికి

## రెండు బైకులు ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

**బిజినపల్లి, జనవరి 15 ప్రభాతవార్త:** వెలుగొండ గేటు సమీపంలో రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం గేటు సమీపంలోకి రాగానే ఇరువురు బైకులు బలంగా ఢీకొనడంతో బిజినపల్లికి చెందిన మురళి అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటనలో మరో వ్యక్తి స్వల్ప గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో ఇరువురిని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

### సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపు కోసం

# క్షేత్రస్థాయిలో సర్వే

◆ జనవరి 26 నుండి సంక్షేమ పథకాల అమలుకు చర్యలు ◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



కలెక్టరేట్లో అధికారులకు సర్వేపై దిశా నిర్దేశం చేస్తున్న కలెక్టర్

**వనపర్తి టౌన్ జనవరి 15 ప్రభాతవార్త:** జనవరి 26 నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ పథకాలను జనవరి 20 లోపు క్షేత్రస్థాయి సర్వే పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు, వ్యవసాయ విస్తీర్ణాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సర్వే పై దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి అమలు చేయనున్న సంక్షేమపథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించి అర్హత లేని వాటిని తొలగించే విధంగా పకడ్బందీగా సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు భరోసాపై సర్వే చేసేందుకు మండలంలోని తహసిల్దార్, మండల వ్యవసాయాధికారి ఈ ప్రక్రియకు బాధ్యులుగా ఉంటాన్నారు. ప్రతి గ్రామానికి రెవిన్యూ ఇన్స్పెక్టర్, వ్యవసాయ విస్తీర్ణాధికారి ఒక జట్టుగా వ్యవహరించి రెవెన్యూ గ్రామం ఆధారంగా జట్టు సభ్యులుఅన్ని సర్వే నెంబర్లను సందర్శించి, వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించాలని సూచించారు. ఇళ్ళు, రోడ్లు, పరిశ్రమలు నిర్మించుకున్న స్థలాలను వ్యవసాయ యోగ్యం లేని స్థలాలుగా గుర్తించాలని సూచించారు. లే అవుట్లు, భూసేకరణ చేసిన భూములను గుర్తించి వ్యవసాయ యోగ్యత లేని భూమిగ గుర్తించాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వే సందర్భంగా పంచాయతీ సెక్రటరీ, రెవెన్యూ సిబ్బంది భూమి లేని కూలీలు ఎవరైతే2023-24 సంవత్సరంలో కనీసం 25 రోజులు పనిచేసి ఉన్నారో అలాంటి వారిని గుర్తించి వారి ఆర్థిక స్థితిగతులు పరిశీలించి అర్హుల జాబితా రూపొందించాలన్నారు. రూపొందించిన జాబితాను జనవరి 21 నుండి 24 వరకు జరిగే గ్రామ సభలో పెట్టి తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఇందిరమ్మ ఇళ్ళ విషయంలో గుర్తించిన 36206 కుటుంబాలను సందర్శించి నిబంధనలకు అనుగుణంగా, వాస్తవంగా అర్హత కలిగిన పేద కుటుంబాలను మాత్రమే గుర్తించి జాబితా రూపొందించాలని సూచించారు. కొత్త రేషన్ కార్డుల విషయంలో తుది జాబితాలో చోటు లభించిన 6647 కుటుంబాలను సందర్శించి వాస్తవికంగా అర్హత ఉన్నదా లేదా అనేది గుర్తించి అర్హత కలిగిన వారి జాబితా రూపొందించాల్సి ఉంటుందని తెలియజేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన అనేది నిబంధనలకు అనుగుణంగా చాలా పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. సర్వే పూర్తి అయిన అనంతరం జనవరి 21 నుండి 24 వరకు సర్వేలో రూపొందించిన జాబితాను గ్రామ సభలో పెట్టి ఆమోద తీర్మానం తదనంతరం ఆన్లైన్ లో నమోదు చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, జడ్పి సీఈఓ యాదయ్య, పి.డి గ్రామీణాభివృద్ధి శాఖ ఉమాదేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్,డి.పి.ఒ సురేష్, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఒలు, ఏ.ఈ.ఒలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ సెక్రటరీలు, సర్వేజట్టు సభ్యులు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు : జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్ జనవరి 15 ప్రభాతవార్త:** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను అందిస్తున్నామని, కాబట్టి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, అన్ని పిహెచ్సిల పరిధిలో ఏఎన్సి( ప్రెగ్నెన్సీ కేసులు) రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరగాలనిసూచించారు. ఆశ వర్కర్లు, ప్రైవేట్ ఆస్పత్రిల నుంచి డేటా తెప్పించుకొని ఏఎన్సి( ప్రెగ్నెన్సీ కేసులు) రిజిస్ట్రేషన్లు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం పై ఆ విషయంలో శాఖ ఉన్నతాధికారులు దృష్టి సాధించాలని చెప్పారు. పీహెచ్సిలలో ప్రసవాల సంఖ్య పెరగక పోవడానికి గల కారణాలు ఏంటని ఆరా తీశారు. వచ్చే నెల నుంచి పీహెచ్‌సిలలో ప్రసవాల సంఖ్య పెరగాలని సూచించారు. అదేవిధంగా, జిల్లాలో వీలైనంత ఎక్కువ మందికి టీబీ స్క్రీనింగ్ చేయాలని, నిర్దేశిత లక్ష్యం అనుగుణంగా స్క్రీనింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఇక ఎన్సిడి స్క్రీనింగ్ విషయానికొస్తే మార్చి 31 లోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఓ పి డి నమోదు సమయంలోనే అభా కార్డుల జనరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రతి ఆసుపత్రిలో అత్యవసర మందులు (ముఖ్యంగా పాము కాటు లేదా కుక్క కాటు) సంబంధించిన నిల్వ తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మానసిక ఆరోగ్యం పై అవగాహనకు సంబంధించిన వాల్ పోస్టర్లను తప్పనిసరిగా విద్యాసంస్థల్లో అంటించాలని ఆదేశించారు. జిల్లా ఆస్పత్రిలో కంటి చికిత్స సేవలు అందిస్తున్నామని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎవరైనా కంటి సమస్యలకు సంబంధించి కేసులు వస్తే పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ శ్రీనివాసులు, సాయినాథ్ రెడ్డి, సూపరిండెంట్ రంగారావు, పి ఓలు, ఎంఒలు, ఇతర వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాధికారంతోనే బహుజనులకు హక్కులు

### బీఎస్పీ కొల్లాపూర్ అసెంబ్లీ అధ్యక్షులు బొల్లి కురుమయ్య



మాయావతి జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న బిఎస్పి నాయకులు

**కొల్లాపూర్, జనవరి15 ప్రభాతవార్త:** దేశంలో అత్యధిక జనాలైన బహుజనులకు హక్కులు, అభివృద్ధిఫలాలు దక్కాలంటే రాజ్యాధికారంతోనే సాధ్యమని బహుజన సమాజ్ పార్టీ కొల్లాపూర్ అసెంబ్లీ అధ్యక్షుడు బొల్లి కురుమయ్య అన్నారు. బుధవారం బీఎస్పీ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర బీఎస్పీ అధినేత్రి, ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి 69వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ అధ్యక్షుడు బొల్లి కురుమయ్య మాట్లాడుతూ బహుజనుల సంక్షేమం కోసం, తన జీవితాన్ని అంకితం చేసిన మహా నాయకురాలు మాయావతి అన్నారు.తన చదువు అయిపోయిన వెంటనే బహుజన ఉద్యమ జెండా పట్టుకుని, బహుజన ఉద్యమరథాన్ని మాన్యవర్ కాన్షీరాం నాయకత్వంలో పార్లమెంట్, అసెంబ్లీలకు పంపించడం జరిగిందని పేర్కొన్నారు. దేశానికి గుండె కాయ లాంటి ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి 4 సార్లు ముఖ్యమంత్రి ఐన ఘనత మాయావతిదేనని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో బీఎస్పీ పార్టీ 36 మంది ఎంపిలతో సపోర్ట్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలోని 93 శాతం సంపద కేవలం 7శాతం వ్యక్తుల వద్ద ఉన్నదని వివరించారు. మిగిలిన 7 శాతం సంపద కోసం, దేశంలోని బహుజన ప్రజలంతా పోరాడుతున్నారని అన్నారు. దేశ సంపదలో బహుజన ప్రజలకు వాటా దక్కాలి అంటే బహుజనులు, పరిపాలకులు కావాలని తెలిపారు. పరిపాలకులకు మాత్రమే సంపద పంపిణీలో భాగస్వామ్యం ఉంటుందని వివరించారు. అందుకే బహుజనులు ఎస్సీ,ఎస్టీ, బిసిమతపరమైన మైనారిటీలు మరియు అన్ని కులాల పేదలు బిఎస్పీతో నడవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఎస్పీపార్టీ పోటీ చేస్తుందని చెప్పారు. పార్టీలో నిరంతరం యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తామని, యువతరం బిఎస్పీ పార్టీలో చేరాలనికోరారు. తదనంతరం అసెంబ్లీ అధ్యక్షులు బొల్లి కురుమయ్య కేక్ కట్ చేసి, టపాకాయలు కాల్చి నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ పార్టీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి అంజి, అసెంబ్లీ కోశాధికారి ప్రశాంత్, కదిరపాడు మధు, జై భీమ్‌శంకర్, విధాత, విక్రమ్, విష్ణు, కిరణ్, ప్రకాష్, రాజేష్, శ్యామ్ గ్రామ కమిటీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

# కోటకొండ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

### సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు భీమేష్



మాట్లాడుతున్న సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు భీమేష్

**నారాయణపేట టౌన్, జనవరి 15 ప్రభాతవార్త:** అన్ని అర్హతలు ఉన్న కోటకొండ గ్రామాని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ నాయకులు కోస్గి భీమేష్ అన్నారు. బుధవారం గ్రామంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచిన వెంబడే కోటకొండ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కుంభం శివకుమార్ రెడ్డిలు హామీ ఇచ్చారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన ఇప్పటిదాకా కోటకొండ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయలేదన్నారు.కోటకొండ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో సి పి ఐ (ఎంఎల్ )మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలాన్ని కోరుకునే ప్రతి ఒక్కరు పార్టీలకు అతీతంగా పోరాడి సమస్య పరిష్కరించుకుందామన్నారు. అందుకుగాను ప్రతి ఒక్కరు భాగస్వాములై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలోనాయకులు హాజీ మల్లంగ్, కావాలి దసప్ప, ఇస్మాల్ , రైతు సంఘం నాయకులు మంగలి సుభాష్, మంగలి హనుమంతు, చుక్కా కేశవులు తదితరుల తోబాటు ఉన్నారు.

## వ్యవసాయ పొలాలే క్రీడా మైదానాలు

### మైదానాలు లేక యువత క్రీడలకు దూరం



వ్యవసాయ పొలంలో క్రికెట్ పోటీలు ఆడుతున్న దృశ్యం

**చిన్నచింతకుంట, జనవరి15 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాలే క్రీడా మైదానాలుగా చేసుకొని ఆటలు కొనసాగిస్తున్నారు క్రీడాకారులు. ఈసంక్రాంతి పండుగ సందర్భంగా ఆయా గ్రామాలలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ క్రీడ పోటీలను నిర్వహిస్తున్నారు.కానీ క్రికెట్ కు మాత్రం యువత ఆసక్తి చూపడంతో ప్రతి గ్రామంలో క్రికెట్ క్రీడ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను నిర్వహించేందుకు క్రీడా మైదానాలు లేక వ్యవసాయ పొలాలనే చదును చేసుకుని ఆటలు ఆడుతున్నారు. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడమైదానాలు ఉండాలని లక్షల రూపాయలు వెచ్చించి క్రీడ మైదానాలు ఏర్పాటు చేశారు కానీ అవి క్రీడలకు అనువుగా లేకపోవడంతో ఏ ఒక్క క్రీడాకారుడు ఆ క్రీడ మైదానాల వైపు చూడడం లేదు. ఈ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల యువతకు క్రీడల వైపు మళ్లించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్తున్నారు కానీ గ్రామాలలో క్రీడ మైదానాలు లేక గ్రామీణ యువత క్రీడా పోటీలకు దూరమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వివిధ ఆటలపై ఆసక్తి ఉన్న సాధన చేసుకునేందుకు సరియైన మైదానాలు లేక యువత క్రీడలు వైపు చూడడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల యువత క్రీడల్లో రాణించాలంటే ప్రతి గ్రామంలో క్రీడ మైదానాలను ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

### భారతదేశ ఔన్నత్యాన్ని చాటిన స్వామి వివేకానంద

**బిజినపల్లి, జనవరి15 ప్రభాతవార్త:** భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచమంతాచాటిన వ్యక్తి స్వామి వివేకానంద అని వడ్డేమాన్ ఎన్ఆర్ఐతిప్పిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. అమెరికాలోని అగస్టా, అట్లాంటా నగరాల్లో మంగళవారం స్వామి వివేకానంద విగ్రహాలను నెలకొల్పినట్లు తెలిపారు. తిప్పిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 125 ఏళ్ళ క్రితం చికాగోలో జరిగిన సర్వమత సమ్మేళన సభలో స్వామి వివేకానంద చేసిన అనితర సాధ్యమైన ప్రసంగం నేటికీ ప్రపంచం అంతా గుర్తు చేసుకునేదిగానే నిలిచి ఉందని తెలిపారు. ఆంగ్లభాషలో స్వామి వివేకానందుని ప్రసంగానికి అమెరికా ప్రజానీకం నీరాజనాలు పట్టింది అన్నారు. తన బోధనలతోనే యువతలో చైతన్యాన్ని నింపాడు అన్నారు. ఇనుప నరాలు, ఉక్కు కండరాలున్న వందమంది యువకులను ఇస్తే ఈ దేశాన్ని మార్చి చూపిస్తాను అన్న వివేకానంద ప్రతి తరానికి దారి దీపంలా నిలుస్తారన్నారు. ఆధునిక భారత నిర్మాణం కోసం ఎంతగానో పరితపించిన వ్యక్తి విగ్రహాలను నెలకొల్పడం అదృష్టంగా భావిస్తున్నామని వివరించారు. విగ్రహాలు నెలకొల్పడం పట్ల భారత ప్రధాని నరేంద్రమోదీ ఎన్ఆర్ఐ రామచంద్రారెడ్డిని అభినందించినట్లు వివరించారు.

### అయ్యప్ప స్వామి దేవాలయంలో మకర జ్యోతి పూజలు

**నారాయణపేట టౌన్, జనవరి15 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శబరిమలలో భక్తులకు మకర జ్యోతి దర్శనం ఇవ్వడం సందర్భంగా స్వామివారి మూల విరాట్ విగ్రహానికి శరణ ఘోషలతో మహా అభిషేకం, పసుపు కుంకుమ చందనాభిషేకం, మహా అభిషేకం అలంకరణ నైవేద్యం మహా మంగళహారతి వితరణ నిర్వహించారు. భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

### సంక్రాంతి సంబరాల్లో కేపీఎల్ టోర్నమెంట్
#### కేరింతలతో సందడి చేసిన యువకులు

**నవాబుపేట, జనవరి 15 ప్రభాతవార్త:** సంక్రాంతి సంబరాలలో భాగంగా కూచూరు గ్రామంలో నిర్వహించిన కేపీఎల్ కూచూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ కూచూర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. గ్రామ యువకులు క్రీడాకారులను చీటీల రూపంలో టీంలీడర్లు యువకులను ఎంచుకొని రెండు రోజులపాటు ఉల్లాసంగా టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. మంగళవారం రోజుకు ఫైనల్ లో తలబడి చిట్టె రాజు టీము మొదటి బహుమతి షీల్డ్ తో పాటు 5వేల రూపాయలు గెలుపొందగా పిట్టల సత్యనారాయణ టీం సభ్యులు ద్వితీయ బహుమతి 2 వేల రూపాయలు అందుకున్నారు. గ్రామ యువత సంక్రాంతికి ప్రతి ఒక్కరు వారి వారి వృత్తిపరంగా జీవనోపాధి పరంగా ఎంత దూరంలో ఉన్న సంక్రాంతి పండగకు ప్రతిసారి ఈ రకంగానైనా కలుద్దామని దాదాపు నూట ఇరవై మందికి పైగా క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొని కెపిఎల్ ప్రీమియర్ లీగ్ ను విజయవంతంగా నిర్వహించారు. కూచూరు యూత్ అసోసియేషన్ మరియు యువకుల సహకారంతో అట్టహాసంగా విజయవంతంగా టోర్నమెంటును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూచూరు యువకులు గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### రంగురంగుల ముగ్గులతో
## సంక్రాంతి సంబరాలు

**జడ్చర్ల, జనవరి 15 ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణంలోని విద్యానగర్ కాలనీలో మకర సంక్రాంతి పురస్కరించుకొని సంస్కార భారతి ఆధ్వర్యంలో సందర్భంగా ముగ్గులు పోటీ నిర్వహించారు. మహిళలు హిందూ సంప్రదాయాన్ని సంస్కృతి పడేలా ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. పండుగ సందర్భంగా ఉదయాన్నే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు వేసిన ముగ్గుల పోటీ తత్వాన్ని పెంపొందించేలా ఉన్నాయి. సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ అందంగా సృజనాత్మకంగా ఆకర్షణీయంగా సంప్రదాయకంగా ప్రతిబింబించే విధంగా రంగవల్లులు తీర్చిదిద్దిన వారికి గుర్తించి వారి ఆకర్షణీయమైన ముగ్గుకు బహుమతి అందజేశారు.

**ఉప్పునుంతల, జనవరి 15 ప్రభాతవార్త:** మకర సంక్రాంతి పర్వదినాన్ని మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఉప్పునుంతల, వెల్టూరు,పెద్దాపూర్, మామిళ్ళపల్లి, పెనిమెళ్ళ, తాడురు, కొరటికల్, కంసానిపల్లి తదితర గ్రామాలలో వృషభరాజులచే (ఎద్దులబండ్లు) పోచమ్మ,ఉందమ్మ, చెన్నకేశవస్వామి ఆలయాల చుట్టూ కేరింతలతో ఊరేగింపు నిర్వహించారు. మామిళ్ళపల్లి శ్రీలక్ష్మినరసింహస్వామిఆలయ ప్రాంగణంలో నిర్వహించినట్రాక్టర్ పోటీలతోఆలయప్రాంగణంకేరింతలతో మార్మోగింది.

**బాలానగర్, జనవరి 15 ప్రభాతవార్త:** బాలానగర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో మహిళలు తమ ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి ఘనంగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. మహిళలు చలిని కూడా లెక్క చేయకుండా తెల్లవారుజామునే లేచి కల్లాపి చల్లి, ముగ్గులు వేసి ఆనందంగా పండుగ జరుపుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా తిరుమలగిరిలో ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు, పెద్దరేవల్లిలో తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. పలు గ్రామాలలో యువకులు క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించారు.

**నారాయణపేట టౌన్, జనవరి 15 ప్రభాతవార్త:** మహిళల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలిగించేందుకు రంగవల్లి పోటీలు నిర్వహించడం జరిగిందని శాస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ విశ్వనాథ్ శ్రీ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గీత స్పెషలిస్ట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి బహుమతులుఅందజేశారు.అనంతరండాక్టర్ మాట్లాడుతూ పండుగలు,సాంస్కృతి, సాంప్రదాయాలు రాబోవు తరాలకు మార్గదర్శకం అన్నారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

### యౌవనస్తుల కూడిక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**గద్వాల జనవరి 15 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని బృందావనం ఫంక్షన్ హాల్ నందు గద్వాల ఎం.బి చర్చ్ సంఘం యౌవన సహజం వారు నిర్వహించిన యౌవనస్తుల కూడిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. యౌవన సహజం ఎం.బి చర్చి ఎమ్మెల్యే కి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. పాస్టర్ సహో కిరణ్ పాల్ ఎమ్మెల్యే కి ప్రత్యేక ప్రార్థన చేసి ఆశీర్వదించడం జరిగింది. గతంలో గ్రామీణ ప్రాంతాలలో క్రైస్తవ సోదరులను దూరంగా ఉంచేవారన్నారు. కానీ ఇప్పుడు పదేళ్లుగా క్రైస్తవ సోదరులను సమానంగా గౌరవించడం జరుగుతుంది. ప్రతి గ్రామంలో చర్చిలు ఉండడం వల్ల పాస్టర్ల వల్ల ప్రతి ఒక్కరిలో మార్పు కనిపిస్తుందన్నారు. చర్చలలో ప్రతి ఆదివారం ప్రతి ఒక్కరు చర్చికి వెళ్లి ఆ యేసుక్రీస్తు ప్రభువు పై భక్తిశ్రద్ధలతో ఉండటం వల్ల గ్రామీణ ప్రాంతాలలో కూడా ప్రజలు మంచి మార్గపు వైపు అడుగులు వేస్తున్నారన్నారు. అదేవిధంగా యువత కూడా చెడు వ్యసనాలకు, చెడు అలవాట్లకు బానిస కాకుండా దేవుని పై భక్తి, శ్రద్ధల నుంచి చర్చికి వెళ్లి పాస్టర్లు చెప్పే ప్రార్థనను వినడం వల్ల వారిలో మంచి ఆలోచనలు రావడంతో సమాజంలో ఇలా ఏ విధంగా బతకాల, సమాజంలోఎలా నిలబడాలి అనే అవగాహన రావడంతో దాదాపుగా ప్రతి గ్రామంలో 70శాతం మార్పు రావడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. గద్వాల ప్రాంతంలో యువతకు స్ఫూర్తినింపడానికి యౌవనస్తుల కూడిక కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు.భవిష్యత్తులో ఉన్నత లక్ష్యానికి ఎదగాలని, అదేవిధంగా భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని ఈ ప్రాంతంలో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురవ హనుమంతు, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, నాయకులు ఉరుకుందు, కురుమన్న, తదితరులు పాల్గొన్నారు.